RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 287 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 నవంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## దేశంలో కుల గణన జరిగి తీరుతుంది: రాహుల్

నాగ్‌పూర్ : దేశంలో కులగణన జరిగి తీరుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. అంతేకాకుండా తమ పార్టీ రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితినీ తొలగిస్తుందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కులగణన వల్ల జనరల్ కేటగిరీ, దళితులు, ఆదివాసీ లు, మైనారిటీలు, మహిళలు.. ఇలా అందరికీ న్యాయం జరుగు తుందన్నారు. అలాగే వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ మలప్పురం జిల్లాలో మాట్లాడుతూ... బీజేపీ, ప్రధాని మోదీ రాజ్యాంగ విలువలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# రేపటి నుంచి కుటుంబ సర్వే

## ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు ప్రారంభం

## ఇళ్లు, యజమానుల జాబితా సిద్ధం




హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటి నంబరు, అందులో నివసించే కుటుంబ యజమాని పేరు నమోదు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఒక్కో గణకుడికి 150 నుంచి 175 ఇళ్ల దాకా కేటాయించారు. శుక్రవారం వరకూ నమోదు చేస్తారు. ఆ రోజుకల్లా రాష్ట్రంలో మొత్తం ఎన్ని ఇళ్లు ఉన్నాయి, వాటిలో ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయనే జాబితాలు సిద్ధమవుతాయి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలలోని సభ్యులందరి సమగ్ర వివరాలను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ ఈ నెల 9న ప్రారంభించి నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

**తొలి రోజున...** ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వివరాలు సేకరించినట్లుగా గణకులు ఆయా ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1,97,554 ఇళ్లకు గాను 48 శాతం(95,106) ఇళ్లకు తొలి రోజే స్టిక్కర్లు అంటించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని, ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మొత్తం 28,32,490 కుటుంబాలుండటంతో 19,328 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు.

మొత్తం సర్వే పూర్తిచేయడానికి 94,750 మంది గణకులను, వారిపై 9,478 మంది సూపర్‌వైజర్లను, ప్రభుత్వం నియమించింది.

**రెండో దశలో 75 ప్రశ్నలు....** రెండో దశ కింద ఈ నెల 9 నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కానుండగా... ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలను 75 ప్రశ్నలు అడిగి నమోదు చేసి కంప్యూటరీకరణ చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో డ్యాష్‌బోర్డులు ఏర్పాటుచేసి ఎన్ని ఇళ్ల సర్వే పూర్తయిందనే అంకెలను కలెక్టర్లు, రాష్ట్ర అధికారులు పరిశీలించి ఎప్పటికప్పుడు తగు సూచనలిస్తారు. గణకులు ఇంటికి వచ్చే సమయానికి ఆధార్, రేషన్‌కార్డులు సిద్ధంగా ఉంచుకుని వాస్తవ సమాచారాన్ని అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సూచించింది.

**కొన్ని ఫిర్యాదులు ఇలా...** ఆదిలాబాద్ జిల్లాలో పరదాన్ కులస్థులు ఎస్టీ జాబితాలో ఉన్నారు. కానీ సర్వే వివరాలు నింపడానికి పరదాన్ కులానికి ప్రత్యేక కోడ్ లేదని, ఇతరులు అని నమోదు చేసే అవకాశాలున్నాయని వారు అభ్యంతరం తెలిపారు. బీసీ–బీ జాబితాలో 84 కులాలకు కోడ్‌లను కేటాయించారని వాటిలో విశ్వబ్రాహ్మణ కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని ఈ సామాజిక వర్గీయులు కోరారు. కులం అనే చోట 'విశ్వబ్రాహ్మణ'అని, వృత్తి ఏదైతే అది నమోదు చేసేలా మార్పులు అవసరమని తెలిపారు.

**పల్లె వదిలి పట్నంలో ఉంటే....** రాష్ట్రంలో పలు కుటుంబాలకు తమ స్వగ్రామాల్లో ఇల్లు ఉన్నా, చదువు, ఉద్యోగం, వ్యాపార రీత్యా నగరాలు, సమీప పట్టణాల్లో నివాసముంటున్నారు. ఇలాంటివారు ఎక్కడ తమ కుటుంబ వివరాలను నమోదు చేయించుకోవాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రతి వ్యక్తి ఆధార్‌కార్డుపై ఏ చిరునామా ఉంటే అక్కడ వివరాలు నమోదు చేయించుకోవాలని ఆదిలాబాద్ జిల్లా అధికారులు గ్రామాల్లో తెలిపారు. దీనిపై ప్రణాళిక శాఖ అధికారిని సంప్రదించగా ప్రజలకు సులభంగా ఉండేలా ఒకట్రెండు రోజుల్లో కలెక్టర్లకు మార్గదర్శకాలు పంపిస్తామని తెలిపారు.

# రైతులకు శుభవార్త...

## నేరుగా ఖాతాల్లోకే బోనస్ డబ్బులు..!



హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు పలు హామీలు ఇచ్చింది. ఇందులో రూ.2 లక్షల వరకు రుణ మాఫీ, రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఉన్నాయి. ఇందులో రుణ మాఫీ అందరికీ చేయలేదు. ఇక రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదు. తాజాగా వడ్ల కొనుగోలు, వడ్లకు సంబంధించి రూ.500 బోనస్ పై మంత్రి వర్గ ఉపసంఘం సీఎం రేవంత్ రెడ్డి నివేదిక ఇవ్వనుంది. నివేదిక సిద్ధమైనట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఈ నివేదికపై చర్చించనున్నట్లు తెలిసింది. ధాన్యం కొనుగోళ్లపై బ్యాంకు గ్యారంటీతో పాటు మిల్లింగ్ చార్జీలు పెంచడం వంటి అంశాలు నివేదికలో ఉన్నట్లు ఉత్తమ్ చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్స్, ఐసీడీఎస్ పథకాల కింద పంపిణీ చేయడానికి సంబంధించిన సన్న బియ్యంపై చర్చించినట్లు వివరించారు. మిల్లర్లతో పలు దఫాలుగా సమావేశమై నివేదిక తయారు చేసినట్లు పేర్కొన్నారు. రూ.500 బోనస్ డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు ఈ కుబేర్ ప్లాట్? ఫామ్ ద్వారా బోనస్ డబ్బులు జమ చేయనున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇవ్వగా.. ప్రస్తుతం సన్న వడ్లకు మాత్రమే రూ.500 ఇవ్వనున్నట్లు పేర్కొంది. బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతే కాదు రైతు రుణ మాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రుణ మాఫీ కాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గుర్తు చేశాయి. రుణ మాఫీపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం ప్రకటన చేయాలని.. ఎప్పటిలోగా రుణ మాఫీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశాయి. వర్షాకాలం సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలన్నారు. హామీలు ఇవ్వడమే కాదు అమలు కూడా చేయాలని చురకలు అంటిస్తున్నాయి.

## తెలంగాణలో 9 మంది డిఎస్పీ ల బదిలీలు...

### ఉత్తర్వులు జరీ చేసిన డిజిపి జితేందర్




హైదరాబాద్, నవంబర్,07 : పి. దేవేందర్ రెడ్డి, డిఎస్పీ డీసీ ఆర్ బి. నిర్మల్ ను ఎసిపి సి సి ఆర్ బి ఖమ్మం కు బదిలీ అయ్యారు. డి ప్రసన్న కుమార్ ఎసిపి సి సి ఆర్ బి ఖమ్మం ను డిఎస్పీ మెదక్ కు బదిలీ అయ్యారు. వేయూటింగ్ లో ఉన్నా డిఎస్పీ ఆర్ దామోదర్ రెడ్డి డిఎస్పీ పి టి సి అంబర్పేట్ కు బదిలీ అయ్యాను. జగిత్యాల డి సి ఆర్ బి డిస్పి జి. మహేష్ బాబు డిఎస్పీ పి టీ సి, కరీంనగర్ కు బదిలీ అయ్యారు. డిఎస్పీ పిటీసీ బి రామనుజం డిఎస్పీ కాగజ్ నగర్ కు బదిలీ అయ్యారు.

డిఎస్పీ కాగాజ్ నగర్ ఏ కరుణకర్ డిఎస్పీ ఆసిఫాబాద్ కు బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ డిఎస్పీ పి సదయ్యకు డిజిపి ఆఫీస్ కు బదిలీ చేశారు. డిఎస్పీ డిసి ఆర్ బి వనపర్తి కె కృష్ణ కిషోర్ కు డిస్పీ తొర్రూర్ కు బదిలీ అయ్యారు. డిఎస్పీ తొర్రూరు వి సురేష్ను డిజిపి ఆఫీస్ కు బదిలీ చేశారు.

# భాగ్యనగరానికి మహర్దశ

## 6 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు.. ఏయే ప్రాంతాల్లో నిర్మిస్తారంటే..

## హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ పనులకు శ్రీకారం!



**అభివృద్ధితోనే ప్రభుత్వ సమాధానం - చార్మినార్ టు ఆర్ఆర్ఆర్ - నలువైపుల నుంచి రోడ్ల కనెక్షన్ - నగరంలో జక్షన్ల అభివృద్ధి - ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు - ఓఆర్ఆర్ టు ఆర్ఆర్ఆర్ లింక్ రోడ్లు - ఓవైపు మూసీ ప్రక్షాళన - ఇంకోవైపు ఆర్ఆర్ఆర్ పనులు - కొత్తగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు - రూ.826 కోట్లతో 6 జంక్షన్ల నిర్మాణం - మొదటి ప్యాకేజీలో 2 ఫ్లైఓవర్లు, 3 అండర్ పాస్‌లు - రెండో విడుతలో 4 ఫ్లైఓవర్లు, 4 అండర్ పాస్‌లు - హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్ల బడ్జెట్ - ఎటు నుంచైనా ఈజీగా నగరానికి వచ్చేలా ప్లాన్ - హైవేలతో విశాలమైన లింక్ రోడ్ల కనెక్షన్ - అభివృద్ధే తమ లక్ష్యమంటున్న రేవంత్ సర్కార్**

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఈనెల 7కు పది నెలలు పూర్తవుతుంది. పదేళ్లు అధికారానికి దూరంగా ఉండి, ఇంత తక్కువ సమయంలో పాలనపై పట్టు సాధించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అంత ఆషామాషీ కాదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అటు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే ఇటు రాష్ట్ర అభివృద్ధిలో కీలక అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు కనిపిస్తోంది. అలాగే, ఆర్ఆర్ఆర్ పనులను వేగవంతం చేసింది.

**నగరంలో కీలక ప్రాజెక్టులు :** హైదరాబాద్ అభివృద్ధి కోసోం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. తాజాగా కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్లను విస్తరిస్తోంది. అండర్ పాస్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం పరిపాలన అనుమతులు ఇచ్చింది. రూ.826 కోట్ల వ్యయంతో 6 జంక్షన్లను డెవలప్ చేసేందుకు ప్లాన్ గీసింది. రెండు ప్యాకేజీలుగా వీటిని అభివృద్ధి చేస్తోంది. మొదటగా రెండు ఫ్లైఓవర్లు, మూడు అండర్‌పాస్‌లు నిర్మించనుంది. ఇక రెండో విడుతగా నాలుగు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ పాస్‌ల నిర్మాణం ఉంటుంది. వీటి నిర్మాణంతో నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయి. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కేబీఆర్ పార్క్, రోడ్ నెంబర్ 45, ఫిలిం నగర్ జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, పూరి జగన్నాథ్ ఆలయం దగ్గర రూపురేఖలు మారిపోనున్నాయి. ఇక, ప్రతిష్టాత్మక మూసీ ప్రక్షాళన కూడా చేపట్టింది ప్రభుత్వం. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. చాలామంది స్వచ్ఛందంగా తమ ఇళ్లను ఖాళీ చేస్తున్నారు. వీటితోపాటు ఇంకా మరికొన్ని ప్రాజెక్టులను చేపడుతోంది రేవంత్ ప్రభుత్వం. ఇవన్నీ పూర్తయితే, హైదరాబాద్ రూపురేఖలే మారిపోతాయి.

**ఆర్ఆర్ఆర్‌తో తెలంగాణ బ్రాండ్ :** ఇప్పటికే ఓఆర్ఆర్ దాకా నగరం విస్తరించింది. చాలా ఏరియాల్లో ఓఆర్ఆర్ కూడా దిటి పెద్ద పెద్ద అపార్ట్ మెంట్ల నిర్మాణం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ కీలకంగా మారింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, కేంద్ర పెద్దలతో తరచూ చర్చలు జరుపుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది.

ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో తెలంగాణ అంతటా రోడ్ల కనెక్టివిటీ చాలా ఈజీ అవుతుంది. ప్రయాణ సమయం తగ్గిపోతుంది. రాజధాని హైదరాబాద్ నగరానికి వచ్చి వెళ్లడం పెద్దగా కష్టంగా అనిపించదు. దీనివల్ల ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ పనుల్లో వేగం పెంచింది ప్రభుత్వం.

# సంపాదకీయం

## ట్రంప్ రాక.. హెచ్-1బీ వీసా కాక సవాళ్లు తప్పదటగా?

అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో... భారత్ కు కలిసొచ్చే అంశాలు, ఎదురయ్యే సవాళ్లు, ఎదుర్కోవడం తప్పని సమస్యలపై చర్చ బుధవారం ఫస్టాఫ్ నుంచే మొదలైపోయింది. ఈ సమయంలో వాటిలో ప్రధానంగా హెచ్-1బీ వీసా విషయంలో ట్రంప్ నిర్ణయాలు ఎలా ఉండబోతున్నాయనేది చర్చకు వచ్చింది! అవును... "అమెరికా ఫస్ట్" అనే నినాదాన్ని ఎంచుకుని ఎన్నికల ప్రచారం చేపట్టిన ట్రంప్ మాటలకు అగ్రరాజ్యం ప్రజలు బలంగా నమ్మారు. దీంతో.. ఆ మాటకు కట్టుబడి ఉండటంపై ట్రంప్ ఫోకస్ పెడతారని అంటున్నారు. ఈ సమయంలో... గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు ఇమ్మిగ్రేషన్ ఆంక్షల విషయంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసుకుంటున్నారు. 2016 ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారిగా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్... ఇమ్మిగ్రేషన్ విషయంలో మరిన్ని ఆంక్షలు అమలు చేయాలని కోరుతున్నట్లు స్పష్టం చేశారు. వీటిలో హెచ్-1బీ వీసా ప్రోగ్రాం కూడా ఉంది. ఇది... చాలా మంది అంతర్జాతీయ విద్యార్థులకు, గ్రాడ్యుయేషన్ తర్వాత యూఎస్ లో ఉండి పనిచేయాలనుకునేవారికి కీలకంగా మారింది. ప్రధానంగా అమెరికా ఫస్ట్ అనే నినాదాన్ని ఎత్తుకున్న ట్రంప్.. విదేశీయుల కంటే అమెరికన్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు.. వీసాల విషయంలో కఠినమైన నిబంధనలు తెరపైకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇది ముఖ్యంగ భారత్ నుంచి వచ్చి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, యూఎస్ లోనే ఉండి పనిచేయాలనుకునేవారికి సవాల్ అని చెబుతున్నారు!

ఇదే క్రమంలో... ఎక్కువమంది అమెరికన్ల ను నియమించుకునేలా కంపెనీలను బలవంతం చేసే విధానాలను ట్రంప్ ముందుకు తీసుకురావొచ్చని.. విదేశీ కార్మికులు ఎంతకాలం ఉండొచ్చో పరి మితి కూడా విధించొచ్చని చెబుతున్నా రు. ట్రంప్ రాకవల్ల.. చదువు తర్వాత అమెరికాలో ఉండాలనే అంతర్జాతీయ విద్యార్థులకు గణనీయమైన కష్టాన్ని కలిగించే చాన్స్ ఉందని చెబుతున్నారు.

# షామీర్పేట చెరువు వద్ద ఘనంగా ఉత్తర భారతీయుల ఛత్ పూజలు





శామీర్ పేట, (గరుడ వార్త) : ఉత్తర భారతీయుల తమ ఆచారాన్ని అనుసరిస్తూ ఛత్ పూజలను శామీర్ పేట పెద్ద చెరువులో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్తర భారతీయులు దీపావళి అనంతరం ఆరు రోజులు ఎంత నిష్టతో ఉపవాస దీక్ష చేపట్టి ఏడో రోజు సూర్యాస్తమయం, మరుసటి రోజు సూర్యోదయం సమయంలో చెరువులలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఈ పూజలు నిర్వహించడం ఉత్తర భారతీయుల ఆనవాయితీగా వస్తుంది. ప్రతి సంవత్సరం నగరంలో, నగర పరిసర ప్రాంతాలలో నివాసముంటు న్న ఉత్తర భారతీయులు ఈ ఛత్ పూజలు జరుపుకొని పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకుంటారు. ఒకరికొకరు వాయనలను ఇచ్చిపుచ్చుకుం టారు. ఈ ఛత్ పూజలకు ఉమ్మడి శామీర్ పేట మండల మాజీ ఎం పీపీ చంద్రశేఖర్ యాదవ్ పాల్గొని ఉత్తర భారతీయులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉత్తర భారతీయులు భారీ ఎత్తులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఉండాలంటే.. మా మాట వినాల్సిందే!




జగిత్యాల పురపాలికలో పాలకవర్గ సభ్యుల ఒత్తిడి, పాలనా వ్యవహారాల్లో అడుగడుగునా అడ్డు తగులుతుండటంతో కమిషనర్లు రావడం.. కొద్ది రోజులకే వెళ్లిపోవడం రివాజుగా మారింది.. ప్రస్తుత కమిషనర్ సమ్మయ్యతోనూ పాలకవర్గం అలానే వ్యవహరిస్తుండటంతో అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది..

పుర కమిషనర్‌గా పనిచేసిన అనిల్ భూ కుంభకోణంలో అరెస్టు కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జులై 3న సమ్మయ్య కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరడంతోనే ఆయన పలు విభాగాల్లో అక్రమాలను నిరోధించడంపై దృష్టి పెట్టారు. పుర పాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలను కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పురపాలికలో కొందరు ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇందులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు చేతివాటం చూపారు. మరోవైపు కొందరు సిబ్బందిని కార్యాలయంలో అంతర్గత బదిలీలు చేయాలని కమిషనర్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనని ఆయన స్పష్టం చేయడంతో పాలకవర్గ సభ్యులు తట్టుకోవడం లేదని సమాచారం. విషయం ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి ఇరువర్గాలు తీసుకెళ్లగా ఎవరైనా నిబంధనల మేరకు పనిచేయాలని వారు సూచించినట్లు సమాచారం. అయినా కమిషనర్‌పై పాలకవర్గ సభ్యులు కొందరు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

**అక్రమాలే కారణమా..?** పురపాలక సంఘంలో తరచూ పలు విభాగాల్లో అక్రమాలు వెలుగు చూడటంతో కమిషనర్లు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం లేదా ఇతర ప్రాంతాలకు బదిలీలకు ప్రయత్నించడమో జరుగుతోంది. గతంలో ఓ ఇంటి నిర్మాణ అనుమతి విషయమై పట్టణ ప్రణాళిక విభాగంలో అనిశా దాడి చేయడంతో ఓ టీపీఎస్, పొరుగు సేవల ఉద్యోగి పట్టుబడటం సంచలనం కలిగించింది. గతేడాది రెవెన్యూ విభాగంలో దొంగ రశీదులు సృష్టించినందుకు ఓ సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ సస్పెండ్ కావడంతోపాటు అరెస్టయ్యారు. తాజాగా భూ కుంభకోణంలో కమిషనర్ అనిల్, ఆర్వో ప్రసాద్ సస్పెండ్ కావడంతోపాటు కటకటాల్లోకి వెళ్లారు. మరోవైపు ఇంధన వినియోగంలో అక్రమాలపై సీడీఎంఏ విచారణ కొనసాగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతుకు సంబంధించి కూడా విజిలెన్స్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొందరు అధికారులు సొంతంగా అక్రమాలకు అలవాటు పడగా.. మరికొందరు పాలకవర్గం ఒత్తిడి తట్టుకోలేక నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది.

**అయిదేళ్లలో పలువురి బదిలీ..**

గడిచిన అయిదేళ్లలో పలువురు కమిషనర్లు విధుల్లోకి రావడం.. దీర్ఘకాల సెలవు పెట్టి బదిలీ చేయించుకోవడం సాధారణంగా మారింది. అక్రమాలకు సహకరిస్తే ఉద్యోగానికి ముప్పు ఉందనే భయంతో ఎం.రవిబాబు 2019 అక్టోబరు 16న సెలవులో వెళ్లారు. డీఈగా ఉన్న లచ్చిరెడ్డికి కమిషనర్‌గా 2020లో బాధ్యతలు ఇవ్వగా ఆయనపై ఆరోపణలు రావడంతో సెలవులో వెళ్లారు. జయంత్‌కుమార్ అనే కమిషనర్ సైతం 2020 జూన్ 18న సెలవులో వెళ్లారు. పలు కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన మారుతిప్రసాద్ 2021 జులై 21న సెలవు తీసుకోక తప్పలేదు. ఇంధన వినియోగంలో తన మార్కు చూపించిన స్వరూపరాణి ప్రజాప్రతినిధులకు సహకరించడంలేదనే విమర్శలతో ముప్పుతిప్పలు పెట్టడంతో 2022 సెప్టెంబరు 4న దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.

# నారసింహుడి భక్తులకు తాగునీటి సమస్యలు

ధర్మపురి: ఏటా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రతిరోజు తాగునీటి సమస్య ఉంటుండగా.. రద్దీ వేళల్లో అధికంగా ఉంటుంది. ప్రతిరోజు స్వామివారి దర్శనానికి 3 నుంచి 5 వేల మంది భక్తులు వస్తుంటారు. 1.50 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతోంది. దివంగత మాజీ మంత్రి జే.రత్నాకర్‌రావు హయాంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని.. భక్తుల భాగస్వామ్యంతో శుద్ధజల నీటి పథకాన్ని ఆలయం పక్కన ఏర్పాటు చేయించారు. అయితే ఇది నిర్వాహణ లోపంతో మూలన పడింది. బోరు ఉన్న సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో ప్రస్తుతం గోపురాల ముందు ఓపెన్ సంపును ఏర్పాటు చేశారు. పురపాలక ట్యాంకర్ల ద్వారా ఇందులో వ్యవసాయ బావులు, గోదావరి నీటిని నింపి ఆలయంలోకి నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ నీటితోనే భక్తులు కాళ్లు, చేతులు కడగడంతో పాటు తాగటానికి ఉపయోగిస్తుండగా.. ఆలయ సిబ్బంది అయితే వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారు. ఇలా అపరిశభ్రమైనా నీటితో భక్తులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం తలాపునే గోదావరి ఉన్నా.. నరసింహుని భక్తులకు



నదీ జలాలు అందడం లేదు. ఆలయంలో పూర్తిస్థాయిలో శుద్ధజలాలు అందించాలనే ఉద్దేశంతో గోదావరి నుంచి పైపులైను వేసి.. 4 మిలియన్ లీటర్ల ప్యూరిఫై ప్లాంటు కోసం 2018లో గతంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలేకే పరిమితమైంది తప్ప పనులకు మాత్రం మోక్షం లభించ లేదు. శాశ్వతంగా ప్రత్యేక శుద్ధజల పథకాన్ని దేవస్థానంలో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమై**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిఖం భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. **భూసేకరణ జరిగినా..:** జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. **ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం - సుందర్, ఎస్ఈ.** జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకో.. తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగుకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువుకు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థు ల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జిన్‌గుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాతిక సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూరులో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## సొంత వైద్యం శ్రేయస్కరం కాదు

నల్గొండ : వైద్యుల సూచన లేకుండా సొంతంగా మాత్రలు వాడటం.. సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడటం శ్రేయస్కరం కాదని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ పీజీ, డిగ్రీ కళాశాలలో బాధ్యుడు రమాకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు చక్కటి స్పందన లభించింది. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.మాతృనాయక్, గుండె వైద్య నిపుణులు డా.నరహరి, కంటి వైద్య నిపుణులు డా.ఏసీహెచ్ పుల్లారావు, స్త్రీ వైద్యనిపుణులు డా.వసంత కుమారి తదితరులు ఆరోగ్య సమస్యలతో పాటు జిల్లాలో లింగ నిష్పత్తి, శిశు విక్రయాలపై అవగాహన కల్పించారు. కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పట్టణంలోని పలు కాలనీల వాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు పలువురికి పలు రకాల పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు.

ఆరు నెలలకోసారి కంటి పరీక్షలు అవసరం

డా.ఏసీహెచ్.పుల్లారావు, కంటివైద్య నిపుణులు

ప్రతి ఆరు నెలలకు ఓసారి తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. 'ఏ' విటమిన్ లోపం కారణంగా దృష్టి లోపం వస్తుంది. దూర దృష్టి, దగ్గర దృష్టి లోపాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. వయసు రీత్యా వచ్చే శుక్లాలను ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. చరవాణి ఎక్కువగా చూడడం మూలంగా కంటి చూపు మందగించే అవకాశాలున్నాయి. ఆకుకూరలతో పాటు నిత్యం గుడ్డు, పాలు, పండ్లు వంటి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఒకరు ఇచ్చే నేత్రదానం మూలంగా ముగ్గురికి కంటి చూపు వస్తుంది. యువత రక్తదానంతో పాటు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి.

లింగ నిష్పత్తి వణుకు పుట్టిస్తోంది: డా.వసంత కుమారి

జిల్లాలో లింగ నిష్పత్తి అన్ని వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. కొన్ని మండలాల్లో ప్రతి 1,000 మంది బాలురకు 800 మంది బాలికలు మాత్రమే ఉంటున్నారు. మొదటి కాన్పు బాలిక అయితే రెండో కాన్పునకు ఇష్టపడని వారు ఉండడం విచారకరం. జీవన శైలిలో మార్పుల కారణంగా ప్రతి పది మందిని పరీక్షిస్తే ఆరుగురు పీసీఓడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. రొమ్ము క్యాన్సర్లు గుర్తించడానికి సొంతంగా చేతి స్పర్శతో అవగాహన వస్తుంది. గడ్డలు, కణతులు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించి మామోగ్రఫీ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం. ప్రాథమిక దశలో రోగాలు గుర్తించినట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

సదస్సు ఉపయోగకరంగా ఉందిరావుల శ్రీనివాస్‌రెడ్డి

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సు ఉపయోగకరంగా ఉంది. పట్టణ వాసులు తమ సమస్యలను వైద్యుల ద్వారా పరిష్కరించుకోగలిగారు. బీపీ, చక్కెర వ్యాధితో పాటు యూరిక్ యాసిడ్, గుండె జబ్బులు ఎలా వస్తాయి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుసుకోగలిగాను.

20 ఏళ్ల వారిలోనూ గుండె నొప్పి

డా.నరహరి, గుండెవైద్య నిపుణులు

గతంతో పోల్చితే ఈ మధ్య గుండె నొప్పి బాధితులు పెరుగుతున్నారు. 20 ఏళ్ల వయసు వారు సైతం గుండె నొప్పి బారిన పడుతున్నారు. మద్యం, మాంసాహారం, బేకరీ ఫుడ్, మానసిక ఒత్తిడి, వంశపారంపర్యం వంటి కారణాలతో చక్కెర వ్యాధి, బీపీ, హైకొలెస్ట్రాల్ ముప్పు ఏర్పడుతోంది. ఎడమ వైపు భుజం గుంజడం, ఛాతి మధ్యలో నొప్పి రావడం లక్షణాలతో గుండె నొప్పి వస్తుంది. ఈ లక్షణాలు కన్పిస్తే సమీప వైద్యుడి వద్దకు వెళ్లి ఈసీజీ తీసుకుని నిర్ధారణ చేసుకోవాలి. నిత్యం వ్యాయామం, 30 నిమిషాల యోగా, ధ్యానంతో పాటు శాకాహారం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. కరోనా వ్యాక్సిన్ వల్ల గుండె జబ్బులు వస్తున్నాయనే విషయంలో ఎలాంటి ఆధారాలు లేవు. నెలలో 270 అబార్షన్‌లు జరిగాయి

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

జిల్లాలో గడిచిన నెల రోజుల్లో 270 అబార్షన్‌లు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నిరకాల పథకాలు తెచ్చినా వివక్ష కొనసాగుతోంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో శిశు విక్రయాలు జరుగుతున్నాయి. విటమిన్ల లోపం వల్ల అన్నిరకాల రోగాలు వస్తున్నాయి. బీకాంప్లెక్స్ లోపం రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. వయసుతో పనిలేకుండా టైప్-1, టైప్-2, టైప్-3 మధుమేహంతో పాటు బీపీ వస్తున్నాయి. సరైన వ్యాయామం లేకపోవడం, అర్ధరాత్రి వరకు చరవాణి చూస్తూ నిద్రలేమి, జంక్‌ఫుడ్ వంటి వాటి వల్ల రోగాలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో రోగం గురించి తెలుసుకుని సొంత వైద్యం చేసుకోవడం వల్ల కొత్త సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. వైద్యుల సూచనతో మాత్రలు వాడాలి.

చక్కెర వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందా: అరవింద్

తల్లిదండ్రులకు చక్కెర వ్యాధి ఉంటే పిల్లలకు వస్తుందా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

దీనికి డా.మాతృనాయక్ బదులిస్తూ.. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా పుట్టినప్పటి నుంచే చక్కెర వ్యాధి వస్తోంది. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. సందేహాలు ఉంటే వైద్యుల సూచనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

బీపీ వల్ల మెడనరాలు లాగుతాయా: నవీన్‌నాకు ప్రతిరోజు మెడ నరాలు లాగుతున్నాయి. బీపీ ఉందనే అనుమానం ఉంది.డా.మాతృనాయక్ సమాధానం ఇస్తూ.. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయడంతో పాటు 5 లీటర్ల నీరు తీసుకోవాలి. ఇక్కడే బీపీ పరీక్ష చేయించుకుంటే పరిష్కారం దొరుకుతుంది.

## అసైన్డ్ భూములు..అన్యాక్రాంతం

సంగారెడ్డి : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా జిల్లా ఉండడం.. జిల్లా మీదుగా జాతీయ రహదారులు వెళ్లడం.. త్వరలో ప్రాంతీయ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కసరత్తు సాగడం.. వంటి పరిణామాలతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక వ్యాపారుల, నాయకుల కన్ను అసైన్డ్ భూములపై పడింది. వాటిని విక్రయించొద్దు, కొనుగోలు చేయొద్దని నిబంధనలు చెబుతున్నా, ఎన్‌వోసీలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో అసైన్డ్ భూములు స్వాహాపై ప్రత్యేక కథనం.ఎక్కడెక్కడ.. ఎలా.. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో 152 సర్వే నంబరులో 52 ఎకరాలు, 153 సర్వే నంబరులో 15 ఎకరాలు, 155లో 10 ఎకరాలను ఇద్దరు రాజకీయ నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులకు ఎకరం రూ.కోటి చొప్పున విక్రయించారు. రైతులకు మాత్రం ఒక్కొక్కరికి ఒక్కోతీరుగా చెల్లింపులు చేసినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్లు లేకుండా లీజుకు ఇచ్చినట్లుగా హామీపత్రం తీసుకున్నారని పలువురు వాపోయారు. ఎన్‌వోసీ ఇవ్వడంతో సదరు భూములను వ్యాపారులు తమ పేరిట నమోదు చేసుకోవడం గమనార్హం. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో 404సర్వే నంబరులోని మూడెకరాల అసైన్డ్ భూమిలో సగానికి పైగా స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించారు. 410 సర్వే నంబరులో 10 ఎకరాల వరకు అక్రమార్కులు ప్లాట్లుగా చేశారు. గోవుల గుట్ట సమీపంలో 404/51/5 సర్వే నంబరులో ఎనిమిది ఎకరాల్లో సగానికి పైగా ఇళ్లు కట్టేశారు.

# ఊపిరాడట్లే!



హైదరాబాద్: నగరంలో రోజురోజుకు వాయు నాణ్యత క్షీణిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా డీజిల్ ఆటోలు శివార్లలో తిప్పుతుండటంతో విపరీతంగా కాలుష్యం నమోదవుతోంది. గాలిలో సూక్ష్మధూళి కణాలు పెరిగి వాయు నాణ్యత క్షీణిస్తోంది. డీజిల్ ఆటోలకు బదులు ఎల్పీజీ, సీఎన్జీలు వాడాలని 15 ఏళ్ల కిందటే నిర్ణయించారు. నగరంలో 95 శాతం సీఎన్జీ లేదా ఎల్పీజీ ఆటోలే నడుస్తుండగా, శివార్లలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. డీజిల్ ఆటోలకు బదులుగా సీఎన్జీ, పీఎన్జీ ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించొచ్చు. ఆర్టీసీ సైతం డీజిల్ బస్సులకు స్వస్తిపలుకుతూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు అడుగులేస్తోంది. వాహనదారులు సైతం ఇదే మార్గం అనుసరిస్తే దిల్లీ తరహా ఇబ్బందులు ఉండవని నిపుణులు సూచిస్తున్నారు.

**పీసీబీ నివేదిక ప్రకారం..**

ఉప్పల్, కోకాపేట్, జూపార్కు, శేరిలింగంపల్లి, బాలానగర్, బాచుపల్లి, జీడిమెట్ల, చార్మినార్, ఎంజీబీఎస్ ప్రాంతాల్లో సూక్ష్మ ధూళి కణాల స్థాయి అధికంగా ఉంది. కోకాపేట్, జూపార్కు, హెచ్‌సీయూ, ఇక్రిశాట్, బొల్లారం ప్రాంతాల్లో వాయు నాణ్యత క్రమంగా తగ్గుతోంది. సాధారణంగా వాయునాణ్యత సూచీ 100కి తక్కువగా ఉండాలి. 101 నుంచి 200 మధ్య ఉంటే ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల జబ్బులు ఉన్నవారికి ఇబ్బందులు తప్పవు. 201 నుంచి 300 మధ్య ఉంటే దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.

**ఘాటు వాసనలపై ప్రత్యేక నిఘా..**

పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో కట్టడికి పీసీబీ కసరత్తు ప్రారంభించింది. నిఘా పెట్టేందుకు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, అనలిస్ట్‌తో కూడిన ఐదు బృందాలు ఏర్పాటుచేసింది. ఈ బృందాలు ఉదయం, రాత్రి వేళల్లో పారిశ్రామిక వాడల్లో కార్యకలాపాలను నిశితంగా గమనిస్తాయి. పరిశ్రమల్లో కాలుష్య కట్టడి, వ్యర్థాల డంపింగ్, ఘాటు వాసనల కట్టడి తదితర అంశాలను పర్యవేక్షిస్తాయి. ఈ బృందాలు నిత్యం పరిశ్రమల కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. ఉదయం ప్రత్యేక బృందాల పర్యవేక్షణతో పాటు రాత్రి నైట్ ప్యాట్రోలింగ్‌ను పటిష్ఠం చేసినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, రామచంద్రాపురం జోన్ల పరిధిలో 3 నైట్ ప్యాట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయి. రోజువారీ నిఘాతో ఈ బృందాలు ఇచ్చే వివరణ, నివేదికపై 'పీసీబీ సభ్య కార్యదర్శి' స్థాయిలో సమీక్ష జరుగుతుంది. అనంతరం కాలుష్య నియంత్రణపై విధివిధానాలు రూపొందిస్తారు.

**ఫిర్యాదు చేయొచ్చు ఇలా..**కాలుష్యం, వ్యర్థాల డంపింగ్, ఘాటు వాసనలకు సంబంధించిన ఫిర్యాదులకు 10741 నంబరును సంప్రదించొచ్చు. %ttps://tspcb.cgg.gov.in% వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు. అధికారిక వెబ్‌సైట్‌లోని 'జనవాణి-కాలుష్య నివారిణి'లో సైతం ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చు.

## వందేళ్ల వారసత్వం.. నిలువునా నిర్లక్ష్యం



రాయదుర్గం: వందేళ్లనాటి వారస్వత సంపద అది. అలనాటి ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేతృత్వంలో నిర్మితమైన అద్భుత కట్టడం అది. వందేళ్లుగా నిర్విరామంగా నగరదాహార్తిని తీరుస్తోంది. మెహిదీపట్నం, షేక్‌పేట పరిసర ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజల గొంతు తడుపుతోంది. అటువంటి చారిత్రాత్మక కట్టడం ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు దగ్గరవుతోంది. అదే గండిపేట కాండ్యూట్ కాలువ. ఇంతేనా: అనేక చోట్ల భారీగా రంధ్రాలు పడ్డాయి. విలువైన నీరు వృథాగా పోతోంది. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్స్ వరకు 14.5 కి.మీ దూరం నిర్మించారు.

**నిబంధనలకు తిలోదకాలు**

వందేళ్ల నాటి ఈ కాలువను ప్రభుత్వం వారసత్వ సంపదగా గుర్తించింది. కాలువకు ఇరు వైపులా 50 అడుగుల విస్తీర్ణంలో బఫర్ జోన్‌ను నిర్ధారించారు. కోకాపేట నుంచి ఆసిఫ్‌నగర్ వరకు బఫర్ జోన్ ఎక్కడా కనిపించడం లేదు. **ఇలా ప్రత్యేకత:** గండిపేట జలాశయం వద్ద ఎలాంటి విద్యుత్తు, మోటర్లు వినియోగించకుండా ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌కు కాలువలో నీరు చేరుకునేలా తీర్చిదిద్దారు. 8 అడుగుల ఎత్తు, 5 వెడల్పు ఉండే కాలువపై గ్రానైట్ రాళ్లు పైకప్పుగా ఉంటాయి. దశాబ్దం క్రితం గండిపేట జలాశయం ఎండిపోయినపుడు తప్ప కాలువకు విరామం లేదు.

గురుత్వాకర్షణ శక్తితో నీరందించే కాలువ కావడంతో గండిపేట(ఎత్తు) నుంచి దిగువన ఆసిఫ్‌నగర్ వరకు ఏటవాలుగా కాలువ నిర్మాణం చేపట్టారు. మణికొండ, కోకాపేటల్లో కొంత దూరం ఈ కాలువను ఆర్చీలపై నుంచి నిర్మించారు. ఏళ్లుగా నిర్వహణ లేదు. దీంతో కాలువకు అనేక చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి.

గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు కాలువ పొడవునా 40 ప్రదేశాల్లో రంధ్రాలు పడ్డాయి.

కోకాపేట, షేక్‌పేట జానకీనగర్, ఆసిఫ్‌నగర్, పుప్పాలగూడ ప్రాంతాల్లో పెద్ద గండ్లు పడ్డాయి. రోజూ లక్షలాది లీటర్ల నీరు వృథా అవుతోంది. అనేక మంది కాలువ భూగర్భంలో ఉన్న చోట్ల స్లాబుపై మట్టి వేసి భూస్థాపితం చేశారు. చర్యలు తీసుకుంటాం-నరహరి, డీజీఎం, జలమండలికాండ్యూట్ కాలువ పరిధిలో అనేక చోట్ల లీకేజీలు ఉన్న మాట వాస్తవమే. రూ.50 లక్షలతో తొలి దశలో మరమ్మతులకు చర్యలు చేపట్టాం. కాలువపై మట్టి డంపింగ్, మురుగునీటి పైపులైన్ల నిర్మాణాలు చేపట్టకుండా బారికేడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం.

## 'స్మార్ట్'గా దోచేస్తున్నారు..!

నిర్మల్ : మాటల్లో మర్యాద.. నమ్మకం కల్గించేలా ముచ్చట్లు.. చెప్పాలంటే ఇదో కళ. ఇది మనదగ్గరుంటే ఎదుటివారిని సులభంగా ఆకట్టుకోగలుగుతాం. అందుకే.. కొందరు మోసగాళ్లు ఈ దారిని ఎంచుకుంటున్నారు. జీవనమార్గంలో పెరిగిన స్మార్ట్‌ఫోన్ వినియోగం, డిజిటల్ లావాదేవీలను ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. తమ వాక్చాతుర్యంతో ప్రజలను బురిడీ కొట్టిస్తూ అందినకాడికి దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా ఘటనలు పెచ్చుమీరుతుండటం గమనార్హం

**వామ్మో.. ఇలా కూడా చేస్తారా..**

జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా మీసేవ కేంద్రం నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఓ అపరిచితుడి నుంచి కేంద్రం నిర్వాహకుడికి కాల్ వచ్చింది. నేను ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నా. అర్జంటుగా రూ.50 వేలు కావాలి. నగదు పంపిస్తాను, నేను చెప్పిన ఖాతాలో డబ్బు జమచేయాలని కోరాడు. అందుకు అతడు సరేనన్నారు. ఈలోపు అదే అపరిచితుడు ఓ రెస్టారెంట్ నిర్వాహకుడికి కాల్‌చేసి పెద్దమొత్తంలో బిర్యానీలు కావాలని చెప్పాడు. అడ్వాన్స్ కోసం తాను చెప్పిన ప్రదేశానికి వెళ్లాలని చెప్పి, మీసేవ కేంద్రం చిరునామా ఇచ్చాడు. దీంతో రెస్టారెంట్‌లో పనిచేసే వ్యక్తి అక్కడికి వెళ్లాడు. మీసేవ కేంద్రంలో అప్పటికే నలుగురైదుగురు వరుసలో ఉండటంతో, అతడు సదరు అపరిచితుడికి కాల్‌చేసి తాను మీసేవ కేంద్రానికి వచ్చానని చెప్పారు. దీంతో అపరిచితుడు కేంద్రం నిర్వాహకుడికి కాల్‌చేసి, తాను పంపిన మనిషి నగదు తీసుకొని వచ్చాడని, అర్జెంటుగా తాను చెప్పిన ఖాతాకు డబ్బులు బదిలీ చేయమన్నాడు. ఎలాగూ వ్యక్తి ఎదురుగానే ఉన్నాడని కేంద్రం నిర్వాహకుడు నమ్మకంగా అతడు చెప్పిన ఖాతాకు రూ.50 వేలు పంపించాడు. ఆ తర్వాత అక్కడ వేచిచూస్తున్న వ్యక్తిని డబ్బులివ్వమని అడగ్గానే అతడు విస్తుపోయారు. బిర్యానీల కోసం డబ్బు అడ్వాన్స్ తీసుకునేందుకు వచ్చానని, నగదు సంగతి తనకేం తెలియదని బదులిచ్చాడు. దీంతో కేంద్రం నిర్వాహకుడు ఖిన్నుడయ్యారు. తనకొచ్చిన నంబరుకు కాల్‌చేస్తే అది స్విచాఫ్ రావడంతో హతాశుడయ్యారు. వెంటనే తేరుకొని, తాను డబ్బులు పంపించిన ఫోన్‌నంబరుకు మాట్లాడారు. అది హైదరాబాద్‌కు చెందినది. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి, ఖాతాలో డబ్బులు వస్తాయని చెప్పి చాలా సమయం ఎదురుచూశాడన్నారు. ఖాతాలో వచ్చిన డబ్బులు చూసుకొని అతడికి నగదు ఇచ్చి పంపించినట్లు అతడు చెప్పడంతో.. వీరంతా బిత్తరపోయారు. ఎంతో పద్ధతిగా, పకడ్బందీగా జరిగిన మోసం మొత్తం వారిముందు కదలాడింది. ఫోన్‌చేసిందెవరో తెలియదు, వచ్చిన వ్యక్తి ఎవరో తెలియదు.. కానీ, ఫోన్‌లో చేసిన చిన్నపాటి సంభాషణతో నమ్మకంగా డబ్బులు ఇచ్చేసి గుడ్డిగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. అచ్చంగా ఇదే రీతిలో పట్టణంలో జరిగిన మరో సంఘటనలో ఇంకో బాధితుడు రూ. 30 వేలు నష్టపోయినట్లు తెలుస్తోంది.

**ఏం జరిగిందంటే..**

బ్యాంకు అధికారులమని ఫోన్‌చేసి ఏటీఎం బ్లాక్ అవుతుందని, కొత్తదానికి దరఖాస్తు చేసుకోవాలంటూ అమాయక వినియోగదారుల నుంచి ఓటీపీ, ఇతర వివరాలు తస్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. ఇలా మోసపోయి సమాచారం అందించిన వారి ఖాతాల ఆధారంగా నకిలీ ఏటీఎం కార్డులు సిద్ధంచేస్తున్న ముఠా నుంచి కొందరు ఈ కార్డులను కొనుగోలుచేస్తున్నారు. అలా పొందిన కార్డుల ఆధారంగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈలోపు బాధితులెవరైనా బ్యాంకు అధికారులను సంప్రదిస్తే వారు ఆ ఖాతాను, అందులోంచి జరిగిన లావాదేవీలను నిలిపేస్తుంటారు. ఇదేరీతిలో కుంటాల వాసి ఖాతా కూడా ఫ్రీజ్ అయ్యింది. పోలీసుల విచారణలో భాగంగా ఈ విషయాలన్నీ బయటపడ్డాయి.

**ఇదో రకం దోపిడీ** మూడునెలల క్రితం ముథోల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. రాజస్థాన్ వాసులు షేక్ నసీమ్‌ఖాన్, తస్లీమ్‌ఖాన్ అక్కడ సైబర్ మోసాలతో పలువురిని బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. తర్వాత తెలంగాణకు వచ్చి నిర్మల్ జిల్లా కుంటాల మండలంలో ఉంటున్న తమ రాష్ట్రవాసి సలీం వద్దకు చేరారు. ముగ్గురూ బృందంగా ఏర్పడ్డారు. సులభ సంపాదన కోసం.. వీరు కుంటాల మండలంలోని ఓ ఏటీఎం సేవకేంద్రానికి వెళ్లారు. అక్కడ రూ.50 వేలు నగదు కావాలని, డబ్బులు ఆన్‌లైన్‌లో పంపిస్తామని చెప్పారు. నిర్వాహకుడి వద్ద అంతడబ్బు లేదు. ఈలోపు ఓ దుస్తుల వ్యాపారి తన వ్యాపార లావాదేవీలకు సంబంధించి రూ.50 వేలు నగదును ఖాతాలో జమచేసేందుకు అక్కడకు వచ్చారు. దీంతో వారు అతడితో మాటలు కలిపి ఆ డబ్బు తీసుకున్నారు. ఆ తర్వాత వేరేవ్యక్తుల ద్వారా అతడి ఖాతాకు రూ.50 వేలు పంపించడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కానీ, మూడురోజుల అనంతరం ఆ డబ్బులు డ్రా చేసేందుకు వెళ్తే తన ఖాతా నిలిపివేసినట్లు గుర్తించి అవాక్కయ్యారు. బ్యాంకు సిబ్బందిని సంప్రదిస్తే డబ్బు పంపించడంలో నిలిపేశామనడంతో విస్తుపోయారు.

## వంతెన కల నెరవేరేదెలా?

పెద్దపల్లి: గోదావరి నది, మానేరు వాగుల నడుమ జిల్లా విస్తరించి ఉండటంతో ప్రజలకు వంతెనల ఆవశ్యకత ఏర్పడింది. పొరుగు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి వారధులు లేకపోవడంతో గ్రామీణులు ఆర్థిక, దూరాభారాలతో ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఎండకాలం మినహా మిగతా కాలాల్లో రైళ్లు, బస్సుల్లో వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గోదావరిపై గోదావరిఖని, రాయపట్నం, కాళేశ్వరం వద్ద గల వంతెనలు.. సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు జిల్లావాసులు మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఉపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరో ప్రధానమైన యేరు(మానేరు)పై మూడు వంతెనలున్నాయి. మానేరు వాగు గ్రామీణ ప్రాంతాల గుండా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు వంతెనల కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై రూ.80 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో మరికొన్ని గ్రామాల్లో కూడా వంతెనల నిర్మాణానికి ప్రజల నుంచి డిమాండ్ పెరిగింది. కాగా కొన్ని ప్రాంతాల్లో వంతెనలు ఉన్న పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. అలాంటి వాటిపై కథనం.

నెరవేరని స్పీకర్ హామీ

కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణా



నికి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి హామీ ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల నుంచి మానేరులో నిర్మించిన తాత్కాలిక మట్టిరోడ్డుపై కిష్టంపేట వరకు ద్విచక్రవాహనంపై ఆయన వచ్చి వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం మారడంతో వంతెన హామీ వరకే ఆగిపోయింది.

గాలికి కూలిన వంతెనముత్తారం మండలం ఓడెడ్ సమీపంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 2016లో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే భూపాలపల్లి వెళ్లేందుకు సమీప ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. కానీ వంతెన పలు సందర్భాల్లో వరదలకు కొట్టుకుపోవడం, గాలులకు పడిపోవడం జరిగింది. నిర్మాణ వ్యయం రూ.50 కోట్లకు పెరిగినప్పటికి నాణ్యత లోపాలతో వంతెన నిర్మాణం కలగానే ఉంది.

అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగం

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, మానకొండూర్ మండలం వేగురుపల్లి మధ్య మానేరుపై 2016లో రూ.20 కోట్లతో వంతెన నిర్మించారు. కానీ దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. వంతెనకు ఇరువైపులా ప్రభుత్వం అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులే రోడ్డు వేసుకున్నారు. ఈ వంతెనపై నుంచి ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు ఇతర వాహనాలు మాత్రమే వంతెనను వినియోగించుకుంటున్నాయి.

## పశువైద్యం.. దైన్యం..!

మేళ్లచెరువు : ప్రభుత్వ పశు వైద్యశాలల్లో జీవాలకు ఉచిత వైద్యంతోపాటు మందులు పంపిణీ చేయాల్సి ఉంది. అవేమి అందక పాడి రైతు సొంతంగా ఖర్చు చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అరకొరగా మందుల పంపిణీ జరుగుతుండటంతో బయట కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఔషధాలు సరఫరా అవుతున్నా రైతుల దరి చేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోగ నిర్ధారణ పరీక్షలు కరవు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5,39,406 పశువులు ఉన్నాయి. వీటికి సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ఇవి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నా పాడిరైతులకు మాత్రం అందటం లేదు. పశువులకు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదు. ఏమైనా రోగాలొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని పెంపకందారులు చెబుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా పరీక్షల నిర్వహణలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ అధికారులు దాటవేస్తున్నారు.

రవాణా భారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పశువైద్యశాలకు సంబంధించిన అంబులెన్సులు ఎక్కడా లేవు. ఉమ్మడి జిల్లాలో 277 పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటికి ఒక్క అంబులెన్సు కూడా కేటాయించలేదు. దీంతో పశువులకు ఏమైనా చికిత్స అవసరమొస్తే మండల




కేంద్రాలకు తీసుకెళ్లడానికి పాడిరైతులు నానా తంటాలు పడుతున్నారు. సొంతంగా వాహనాలను సమకూర్చుకొని తరలిస్తున్నారు.

బయట కొనమంటున్నారు

నాగిరెడ్డి, పాడిరైతు, మేళ్లచెరువు

పాడి గేదెలు అనారోగ్యానికి గురైతే పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లేవాళ్లం. అక్కడ ఒకటి రెండు మందులు ఇచ్చి మిగతావి బయట కొనుక్కోమనేవాళ్లు. ఒక్కోసారి అవి కూడా లేవని చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వడం లేదని సమాధానమిస్తున్నారు. ఇలాంటప్పుడు ఆసుపత్రికి ఎందుకని బయటనే వైద్యం చేయిస్తున్నాం.

ప్రతిపాదనలు పంపిస్తాంశ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేట జిల్లాలో పశువైద్యశాఖకు సంబంధించిన అంబులెన్సు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంచార వాహనాలతో రైతుల వద్దకు వెళ్లి చికిత్స అందిస్తున్నాం.

# ప్రతిపాదనలు ఘనం.. అమలు అర్ధంతరం

సిరిసిల్ల : జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు చేపట్టడం లేదు. 2023-24 బడ్జెట్‌లో రెండు పురపాలికల్లో కలిపి వివిధ విభాగాల్లో అభివృద్ధికి రూ. 118.36 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటి మంజూరుకు ప్రభుత్వానికి కూడా పంపారు. వాటిలో రూ.18 కోట్లు మాత్రమే ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. అంటే నిర్ణయించిన బడ్జెట్‌లో 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. రెండు పురపాలికల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పన్నుల రూపంలో వస్తున్న రూ.4 కోట్ల ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇతరత్రా ఖర్చులే నెలకు రూ.కోటిపైనే ఉంటున్నాయి. వీటిలోనూ చాలా వరకు గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఉన్నాయి.

**ముందుకు రాని గుత్తేదారులు**

2023-24 పురపాలక బడ్జెట్‌లో రూ.47.70 కోట్లతో వార్డుల వారీగా మురుగుకాల్వలు, సీసీ రహదారులు, కేంద్రీయ విద్యుద్దీకరణ, కూడళ్ల విస్తరణకు టీయూఎఫ్ఐడీసీ కింద ప్రతిపాదనలు చేశారు. వీటిలో సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి. రూ.3 కోట్లతో కలెక్టరేట్-రగుడు కూడలి విస్తరణ



పనులు దక్కించుకున్న గుత్తేదారు పైపైన పనులు చేసి వదిలేశాడు. ఏడాదిగా ఆ పనులు ముందుకు సాగడం లేదు. చంద్రంపేట, శాంతినగర్, నర్సింగ్‌కాలేజీ, సంజీవయ్య కూడళ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రూ.2 కోట్లతో కళాశాల ఆవరణలో క్రీడా మైదానం పనులు ప్రారంభించి వదిలేశారు. సిరిసిల్ల- వెంకటాపూర్ బాహ్యవలయ రహదారిలో రూ.4.60 కోట్లతో కేంద్రీయ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పురపాలికకు అప్పగించలేదు. గత ప్రభుత్వ హయాంలో పురపాలికలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో పురపాలికలో అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్ద ఎత్తున బకాయిలు పడింది. ఇటీవల వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వేములవాడ పురపాలికలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అంబేద్కర్ కూడలి విస్తరణ, క్రీడా మైదానంలో ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పురపాలికలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ నిధుల విడుదలకు ఉన్నతాధికారులను కోరుతూ రెండు నెలల క్రితం లేఖ రాశారు. దీనికి గతంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు చేసుకునేలా మౌఖికంగా ఆదేశించారు. ప్రతిపాదించిన పనులకు నిధుల మంజూరు విషయమై ఎలాంటి సమాచారం రాలేదు. విలీన గ్రామాలు, శివారు కాలనీలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

# కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

కరీంనగర్ : ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.



రిజిస్ట్రార్‌గా రెండేళ్లు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలుచోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికే వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాల ఏర్పాటుకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలి.

# పల్లెకు మార్గం.. సుగమం



తాండూరు : గ్రామీణ ప్రజల ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. అనుబంధ రహదారుల నిర్మాణ కల సాకారం కానుంది. వెరసి తక్కువ దూరం ప్రయాణించి పల్లెలకు చేరుకునే వెసులుబాటు లభించనుంది. సమయం ఆదా కానుంది. రహదారుల మంజూరు నేపథ్యంలో కథనం. ఇతర గ్రామాల మీదుగా రావాల్సిన పరిస్థితి: జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు అనుబంధ దారులు అధ్వానంగా ఉన్నాయి. ఉదాహరణకు.. కొడంగల్, బషీరాబాద్, పెద్దేముల్, వికారాబాద్ మండలాల్లో మారుమూల తండాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే వీటిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

మోమిన్‌పేట మండల పరిధిలో అనుబంధ తండాలకు మట్టిదారుల్లో వెళ్లలేక ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 13 గ్రామాలు కొనసాగుతున్నాయి. ఇవి ఒకదానికికొకటి పక్కపక్కనే ఉన్నప్పటికి రహదారి సదుపాయంలేక ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దీంతో వాహనదారులపై రవాణా భారం పడుతుండగా సమయం వృథా అవుతోంది. మండలంలోని నారాయణ్‌పూర్-పాతతాండూరు దూరం 5.10కి.మీ. ఉండగా రహదారి నిర్మించని కారణంగా యాలాల మండలం మీదుగా 16 కి.మీ. ప్రయాణించి గ్రామానికి చేరుకుంటున్నారు. తాజాగా ఆయా రహదారుల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.16.30కోట్లు నిధులతో 22.15కి.మీ మేర తారు రహదారులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నాం: గ్రామాలకు కొత్తగా అనుబంధ రహదారులు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. మట్టిదారులు, పానాది మార్గాల్లో తొలిసారిగా తారు రహదారులు నిర్మింపజేస్తాం. త్వరలోనే పల్లెలకు కొత్త తారు రహదారులు అందుబాట్లోకి వస్తాయి.

నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు.

# కంది.. కాలం కలిసొచ్చింది!



తాండూరు: పప్పుధాన్యాల్లో 'పోషకాల గని'గా పేరున్న కంది పంట సాగు జిల్లాలో ఈసారి ఆశాజనకంగా ఉంది. డిసెంబరు చివరి నుంచి చేతికి అందే దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, పెసలు, మినుములు, మక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. నామమాత్ర దిగుబడులే చేతికి అందాయి. ఈనేపథ్యంలో సాగులో ఆరోగ్యంగా ఉన్న కందుల నుంచి ఆర్థిక లబ్ధి పొందుతామనే విశ్వాసంతో ఉన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాలు కందులకు నిర్ణయించిన మద్దతు ధరకంటే ఈసారి ఎక్కువ ధరను ప్రకటించింది.

**అనుకూలించిన వర్షాలు**

సాగులో ఉన్న కంది పంటకు వర్షాలు అనుకూలించాయి. ఏటా సెప్టెంబరు, అక్టోబరులో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెల్కభూముల్లో పంట ఏపుగా పెరగక దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చేవి ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వర్షాలు భారీగా కురవడంతో తేమ తగ్గలేదు. ఈ పరిణామం సాగులో ఉన్న పైర్లకు అనుకూలించింది. ఇటు రేగడి అటు చెల్క పొలాల్లో పైర్ల సాగు బాగుంది. జులై, ఆగస్టులో పైర్లు పెరిగే తొలి దశలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు పొలాల్లో కొంత మేరకు దెబ్బతిన్నాయి. వర్షాలను తట్టుకుని నిలిచిన పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. : 2023-24 ఆర్థిక సంవత్సరంలో తాండూరు సహా మిగిలిన తొమ్మిది విపణుల్లో కలిపి రైతులు 2లక్షల క్వింటాళ్లకు పైబడి కందుల విక్రయాలు చేశారు.

**తాండూరు రకంలో 'అట్టాపుల్ గేట్'**

తాండూరు నియోజకవర్గంలో కంది పంట సాగయ్యే నేలల్లో 'అట్టాపుల్ గేట్' అనే ఖనిజం ఉంది. సాగులో ఉన్న కంది పైరు కాండం ధ్రుఢంగా ఉండేందుకు ఈ ఖనిజం దోహదం చేస్తుంది. నాణ్యమైన గింజలు రావడానికి, అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూస్తుంది. ఆమేరకు తాండూరు ప్రాంతంలో సాగయ్యే కందులతో ఉత్పత్తి చేసిన పప్పుకు రుచి ఎక్కువ.

**పచ్చపురుగు నివారణలో నిర్లక్ష్యం చేయొద్దు**

- డాక్టర్ సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు.

జిల్లాలో కంది పైర్లపై ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పచ్చపురుగు ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. పురుగు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు.లీటరు నీటికి 0.3మి.లీ స్పైనోషాడ్ లేదంటే క్లోరో పైరిఫాస్ లీటరు నీటికి 2.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

# మూడుసార్లు జైలుకెళ్లి.. రూటు మార్చి




హైదరాబాద్: నగరంలో మాదకద్రవ్యాల సరఫరాలో నైజీరియన్లదే హవా. తమ ఆనవాళ్లు పసిగట్టకుండా పక్కా వ్యూహంతో స్మగ్లింగ్ చేయటంలో తమదైన శైలి అనుసరిస్తుంటారు. సూడాన్ నుంచి స్టూడెంట్ వీసాతో నగరం చేరిన ఒక యువకుడు అడ్డదారిలో డబ్బు సంపాదనకు మత్తు పదార్థాల పెడ్లర్‌గా మారాడు. అక్కడ ఎదురైన అనుభవాలతో అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లర్‌గా ఎదిగాడు. ఇటీవల హెచ్‌న్యూ(హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్) పోలీసులు 'డెడ్‌డ్రాప్' తరహాలో డ్రగ్స్ చేరవేస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో డ్రగ్‌డాన్ కుర్బాను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. వేర్వేరు ప్రాంతాలు.. పేర్లతో తప్పించుకొని తిరుగుతున్న అతడిని పట్టుకొని సొంతదేశం పంపేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. పీజీ కళాశాలలో చేరి.. నైజీరియన్ కుర్బా అసలు పేరు బయటపడకుండా జాగ్రత్త పడతాడు. స్టూడెంట్ వీసాపై హైదరాబాద్‌కు వచ్చి పీజీ కళాశాలలో చేరాడు. చదువు సరిగా అబ్బటంతో స్వదేశం వెళ్లి మళ్లీ తిరిగొచ్చాడు. విదేశీ భాష నేర్చుకునేందుకు యూనివర్సిటీలో చేరాక.. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. సైనికపురి మకాం మార్చాక కొంతమంది పరిచయమయ్యారు. తొలిసారి మల్కాజిగిరి పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లాడు. ఏడాదిపాటు జైల్లోనే ఉన్నాడు. బయటకు వచ్చాక మకాం టోలిచౌకికి మార్చి పేరు..రూపం మార్చుకొని దందా చేపట్టాడు. రాజేంద్రనగర్, ఫలక్‌నుమా పోలీసులు అరెస్టు చేశారు. విడుదలయ్యాక బెంగళూర్ చేరాడు. అక్కడ నైజీరియన్ల స్నేహంతో స్మగ్లింగ్ పాఠాలు నేర్చుకున్నాడు. అద్దె బ్యాంకు ఖాతాలు సేకరించాడు. నకిలీ పేర్లతో భారతీయ సిమ్‌కార్డు, వాట్సాప్ లావాదేవీలకు నైజీరియా సెల్‌ఫోన్ నెంబర్లు వినియోగించటం మొదలుపెట్టాడు. మూడు దేశాల డ్రగ్ స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని మత్తుపదార్థాలు సరఫరా చేసేందుకు 'డెడ్‌డ్రాప్' విధానాన్ని ఎంచుకున్నాడు. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, పుణె, గోవా నగరాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొన్నాడు. డెడ్‌డ్రాప్ విధానం అంటే.. సరకు ఉంచాల్సిన లొకేషన్ తీసి డ్రగ్ సరఫరాదారుకు స్థానిక ఏజెంట్ పంపితే ఆ ప్రాంతంలో అన్ని పరిశీలించి డ్రగ్‌ను ఉంచుతారు. దీంతో డ్రగ్ కొనుగోలుదారుకు.. స్థానిక ఏజెంట్‌కు ఎలాంటి సంబంధం ఉండకుండా జాగ్రత్త పడతారు. నగదు మూల్ ఖాతాకు జమయ్యేకే సరకు ఎక్కడ ఉంచినదీ తెలియపరుస్తారు. పకడ్బందీగా వ్యవహరించే ఈ విధానాన్నే డెడ్‌డ్రాప్ విధానంగా పేర్కొంటారు.

# కాజ్‌వేలు ధ్వంసం.. మరమ్మతులు పూజ్యం

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ పరిధిలోని బాకురుపల్లి, బాకురుపల్లితండా గ్రామాల నడుమ రోడ్డు, కల్వర్టు ధ్వంసమై మూడేళ్లు అవుతుంది. ప్రస్తుతం కాజ్‌వే కూలిపోయే దశకు చేరుకుంది. కింది భాగంలోని మట్టి, కంకర కొట్టుకుపోవడంతో సీసీ గాలిలో వేలాడుతూ ప్రమాదభరితంగా మారింది. భారీ వాహనాలు వెళితే పూర్తిగా నేలమట్టమయ్యే దుస్థితి నెలకొంది. అయినా కాజ్‌వేను ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు. మండల కేంద్రం నుంచి సత్సంగ సదనం మీదుగా కోరుట్లపేటకు వెళ్లే రోడ్డులో ఓ కల్వర్టు కిందిభాగం కొట్టుకుపోగా సీసీ వేలాడుతోంది. దీనిపై భారీ వాహనాలు వెళితే కూలిపోయే ప్రమాదం నెలకొంది. గతంలో ఓ ట్రాక్టర్ కల్వర్టుపై నుంచి నీటిలో పడిపోగా త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. నాయకులు,



అధికారులు కల్వర్టును పరిశీలించడమే తప్ప నిధుల మంజూరుకు ఎలాంటి కృషి చేయలేదు. గత మూడు నాలుగేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులతోపాటు కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే దశకు చేరుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. అల్మాస్‌పూర్ నుంచి బుగ్గరాజేశ్వరతండాకు వెళ్లే రహదారిలో వంతెన ఓవైపు పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టుల వద్ద మట్టి కోతకు గురైంది. కనీసం మట్టి పోసి, తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి నుంచి కోరుట్లపేటకు వెళ్లే రెండు వరుసల రహదారిలో కోరుట్లపేట వద్ద కాజ్‌వే, అలాగే మండల కేంద్రం నుంచి బండలింగంపల్లికి వెళ్లే రోడ్డులో రెండు కాజ్‌వేలు, అక్కపల్లి వద్ద కాజ్‌వే ఏటా వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. వాటి మీదుగా వరద ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు స్తంభించిపోతున్నాయి. కాజ్‌వేల స్థానంలో వారధులు నిర్మించాలనే ప్రజలు, ప్రయాణికుల కోరిగా కలగానే మిగిలిపోయింది.

ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై ఉన్న కాజ్‌వే ఇది. 2020లో రూ. 20 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మించారు. నిర్మాణంలో సాంకేతిక లోపాల వల్ల వరద తాకిడికి 2021లో కొట్టుకుపోయింది. రూ. లక్షలు వెచ్చించి, మరమ్మతు చేశారు. గత సంవత్సరం, ఈ ఏడాది వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపించాం- శ్రీనివాస్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

కాజ్‌వేల మరమ్మతు కోసం ఎఫ్‌డీఆర్ నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. బాకురుపల్లి నుంచి బాకురుపల్లితండా మధ్య కాజ్‌వే మరమ్మతుకు రూ. 4 లక్షలు, కోరుట్లపేట పారేటి వాగుపై కాజ్‌వేకు రూ. 5 లక్షలు కావాలని కోరాం. పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై వంతెన నిర్మాణానికి రూ. 6 కోట్లు, రాగట్లపల్లి నుంచి నారాయణపూర్ వెళ్లే దారిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమవగా కొత్తగా తారురోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు, అక్కపల్లి వద్ద వంతెనకు రూ. 1.50 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

# ఉత్కంఠకు తెర

హుజూర్‌నగర్ : మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..

రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.

వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాములలో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాములో నిల్వ చేసి నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గోదాముల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కరసత్తు చేయాల్సి ఉంది.

## ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.
సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు.
ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.- అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

## ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్‌ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్‌ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.
ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.
ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.
43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు.సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి
మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

# కోడెల పంపిణీపై ఆశలు



వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల పంపిణీ కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వందల మంది దరఖాస్తు చేసుకొన్నారు. వీరంతా నిరీక్షణ జాబితాలో ఉండటంతో తమకు ఎప్పుడు ఇస్తారని ఆరా తీస్తున్నారు.రాజన్నను దర్శించుకున్న భక్తులు కోడె మొక్కులు చెల్లిస్తుంటారు. దీంతోపాటు మరి కొందరు నిజ కోడెలను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు సమర్పించిన వాటిని ఆలయ అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. కోడెల సంఖ్య పెరిగిపోయి సంరక్షణకు ఇబ్బందికరంగా మారడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 3న అర్హులైన రైతులకు అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు.దాదాపు 700 మంది రైతులకు ఒక జత కోడెలు అందజేశారు. రైతుల కోరిక మేరకు కొందరికి ఆవులను ఇచ్చారు. ఇంకా అనేక మంది ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా అధికారులకు దరఖాస్తులు సమర్పించారు.
పర్యవేక్షణ కరవు రాజన్న గోశాల నుంచి జులై 3 నుంచి 10 వరకు దాదాపు 700 మంది రైతులకు కోడెలు, ఆవులను పంపిణీ చేశారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన దాఖలాలు లేవు. పంపిణీ చేసిన కోడెల సంరక్షణ ఎలా ఉందనేది ఎవరికీ తెలియదు. ఏమైనా పక్కదారి పట్టాయా అనే సమాచారం కూడా అధికారుల వద్ద లేదు.
పంపిణీ చేసిన నెల రోజుల తరవాత వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి సంరక్షణపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిశీలించి కోడెలు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

భారీగా దరఖాస్తులు పెండింగ్

ఉచిత కోడెల పంపిణీ సందర్భంగా భారీ సంఖ్యలో రైతులు తరలి వచ్చి తమకు ఇవ్వాలని దరఖాస్తులు సమర్పించారు. దాదాపు 2,500 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.
ప్రస్తుతం గోశాలలో 500 వరకు కోడెలు, మరో 60 వరకు ఆవులు ఉన్నాయి.శ్రావణ మాసంలో అనుకున్న స్థాయిలో స్వామివారికి నిజ కోడెలను సమర్పించలేదు. దీంతో గోశాలలో వీటి సంఖ్య తగ్గింది.
ప్రస్తుతం గోశాలలో ఉన్న కోడెలు, ఆవుల నుంచి దాదాపు 300 పంపిణీ చేయడానికి అవకాశం ఉంది.
కొన్నింటిని వచ్చే నెలలో పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. క్రమ సంఖ్య ప్రకారం పంపిణీ చేయాలని నిర్ణయించారు. మిగతా వారికి గోశాలకు వచ్చే వాటిని బట్టి దశల వారీగా అర్హులైన రైతులకు ఇవ్వాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

పక్కదారి పడితే చర్యలు

అర్హులైన రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన కోడెలను పర్యవేక్షణ చేయాల్సి ఉంది. పని ఒత్తిడి కారణంగా చేయలేకపోయాం. ఫోన్ ద్వారా తెలుసుకొంటాం. ఇప్పటికైతే కోడెలు పక్కదారి పట్టినట్లు సమాచారం లేదు. వాటిని అమ్మడం, ఇతరులకు ఇవ్వకూడదని పంపిణీ సమయంలో రైతుల నుంచి పంచనామా తీసుకొన్నాం. పక్కదారి పట్టినట్లు నిర్ధారణ అయితే చర్యలు చేపడతాం.
శ్రీనివాస్, ఏఈవో, ఆలయ గోశాల ఇన్‌ఛార్జి

## ముంచుకొస్తున్న గడువు.. పూర్తయ్యేనా పనులు?



కరీంనగర్ : నగరంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల జిల్లా గ్రంథాలయ నూతన భవనం ఇది. రూ.7 కోట్లతో నిర్మితమవుతోంది. నిధులు సక్రమంగా అందితే ఈ పాటికే ఇది పూర్తవ్వాలి. ప్రస్తుతం శరవేగంగానే పనులు జరుగుతున్నా.. ఎప్పటికప్పుడు బిల్లులు అందితేనే మరో రెండు మూడు నెలల్లో పూర్తయ్యే వీలుంది. ఇదే కాకుండా నగరంలో పలురకాల పనులకు నిధుల గండం ఎదురవుతోంది. మరో 6 నెలల్లో అన్ని పనులు పూర్తవ్వాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటందాలి.
రెండు వారాల కిందట దిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశంలో కరీంనగర్ నగరపాలక సంస్థ పనుల ప్రగతిపై చర్చ జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ ఈ సమావేశానికి హాజరై ఇక్కడి పనుల ప్రగతిని వివరించారు. మూడు నెలల కిందట కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.30.62 కోట్లు విడుదలయ్యాయి. ఆ నిధులకు సంబంధించిన యూసీ (యుటిలైజేషన్ సర్టిఫికెట్)లు సమర్పిస్తే మిగతా నిధులను అందిస్తామని కేంద్రప్రభుత్వం తరపున అధికారులు విన్నవించారు.
రూ.30.62 కోట్లు కేంద్రం వాటా విడుదలవగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటాగా రూ.30.62 కోట్లు రావాలి. మొత్తంగా రూ.61.24 కోట్లు తక్షణమే విడుదలైతే ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు వీటిని వెచ్చించొచ్చు. ఈ మేరకు ఈ నిధులను విడుదల చేయాలని ఇటీవలే కొన్ని రోజుల కిందట నగరపాలిక కమిషనర్ సీడీఎంఏకు లేఖ రాశారు. స్మార్ట్ సిటీ గడువు వచ్చే ఏడాది మార్చి 31తో ముగుస్తుండటంతో మిగులు పనులకు నిధులు అత్యవసరమయ్యాయి.

రూ.188కోట్లు అవసరం..!

ఆకర్షణీయ నగరం గడువు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో నిబంధనల ప్రకారం ఇంకా సుమారుగా రూ.188.11కోట్లు కరీంనగర్‌కు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు అవసరమైన ప్రగతి కోసం రూ.398.13 కోట్లు కేంద్రం నుంచి రూ.398.13 కోట్లు రాష్ట్రప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఇవి కాకుండా ఇటీవల కేంద్ర సర్కారు రూ.30.62కోట్లు విడుదల చేసింది. ఈ నిధులకు తోడుగా రాష్ట్రం నుంచి రూ.30.62 కోట్లు జతచేసి మొత్తంగా రూ.61.24కోట్లు బల్దియాకు పంపాలి కానీ.. రాష్ట్ర సర్కారు ఈ నిధులను ఇంకా విడుదల చేయలేదు. దీంతో ప్రస్తుతం నడుస్తున్న పనులకు ఈ నిధుల ఆవశ్యకత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. మొత్తం పనులు పూర్తవ్వాలంటే చేసిన పనులకు చేసినట్టుగా యూసీలు సమర్పిస్తే ఇంకా రూ.188.11కోట్లు వచ్చేస్తాయి.

ఇన్నాళ్లుగా కేటాయింపులు..

25 రకాల పనులు ఇప్పటి వరకు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి రూ.647.06 కోట్లు వెచ్చించారు.
మరో 20 చోట్ల కీలకమైన అభివృద్ధి జరగాలి. వీటికి రూ.259.69 కోట్లకుగాను 96.88 కోట్లు ఖర్చయ్యాయి.
రెండు పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. రూ.27కోట్లతో చేపట్టే వీటికి నిధులు అత్యవసరం.
స్మార్ట్‌సిటీ కింద మొత్తంగా రూ.934.35కోట్లు రావాలి. ఇప్పటి వరకు రూ.746.24కోట్లు విడుదలయ్యాయి.
యూసీలు సక్రమంగా పూర్తి చేస్తే కేంద్రం, రాష్ట్ర వాటాగా ఇంకా రూ.188.11కోట్లు నగరానికి రావాల్సి ఉంది.

# నగరంలోనూ నేర పాఠాలు

హైదరాబాద్: దొంగతనాలు, మోసాల్లో ఆరితేరిన ముఠాలు ఆనవాళ్లు బయటకు తెలియకుండా నయా మార్గం ఎంచుకుంటున్నాయి. మైనర్లు, యువతను ముందుంచి నేరాలు చేయిస్తున్నాయి. ద్విచక్ర వాహనం కొట్టేయటం నుంచి..నకిలీ అధికారుల రూపంలో బురిడీ కొట్టించటం దాకా నేర్పిస్తున్నాయి. వారిని ఆయా బృందాలకు నాయకులుగా నియమిస్తున్నాయి. ఎక్కువ సంపాదించిన వారికి రెండు మూడు రెట్లు జీతం అదనంగా ఇస్తున్నాయి.
ఉదాహరణలివిగో..పాతబస్తీ నేరస్తుడు.. వందకు పైగా కేసుల్లో జైలుకెళ్లొచ్చాడు. సొమ్ము కొట్టేసేందుకు కొత్త మార్గం ఎంచుకున్నాడు. చిల్లరగా తిరిగే యువకులకు బిర్యానీ, బైక్‌లపై తిరిగేందుకు పెట్రోల్ ఖర్చులు ఇస్తూ సెల్‌ఫోన్ల చోరీ నేర్పించాడు.రాత్రిళ్లు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వారు చోరీ చేసిన ఫోన్లను దళారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు.ఇటీవల బహదూర్‌పురలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలుడు తన పక్కనే కూర్చున్న వృద్ధుడి జేబులోని నగదు కొట్టేశాడు. చాదర్‌ఘాట్ వద్ద మరో యువకుడు ఓ వ్యక్తి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. సీసీ ఫుటేజీ ద్వారా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమీషన్ వస్తుందనే ఆశతో నేరాలకు పాల్పడ్డామని.. తాముండే ప్రాంతానికి చెందిన కొందరు చోరీలపై శిక్షణ ఇచ్చారంటూ సమాధానమిచ్చారు.
శిక్షణ ఇలా..నగర శివార్లకు చెందిన దొంగలు బైకుల తాళాలు తీసి క్షణాల్లో మాయం చేయగల నేర్పరులు.. తల్లిదండ్రుల పర్యవేక్షణకు, చదువుకు దూరమైన 12-15 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలతో మాట కలుపుతారు. కొద్దిరోజులు నగరమంతా తిప్పుతారు.బైకులపై ఫీట్లు చేయటం అలవాటు చేస్తారు.తాళం వేసిన బైక్‌లను ఎలా చోరీ చేయాలి? ఎలా స్టార్ట్ చేయాలనేదానిపై రాత్రిళ్లు శిక్షణ ఇస్తారు. ఒక్కో వాహనానికి రూ.2-3 వేలు కమీషన్ ఇస్తారు. అంతర్రాష్ట్ర ముఠాల వారు సెల్‌ఫోన్ల చోరీలకు మైనర్లు, మహిళలను పావులుగా మార్చుకుంటున్నాయి. రద్దీ ప్రాంతాల్లో ఫోన్లు దొంగిలించటంపై శిక్షణ ఇస్తున్నారు. పిల్లలు పట్టుబడినపుడు అక్కడున్న మహిళలు అడ్డుకుని, తమతో అనుచితంగా ప్రవర్తించారని గొడవ చేయాలని సూచిస్తున్నారు. ఫోన్ కొట్టేశాక సమీపంలోని ముఠా సభ్యుడికి అందజేసే వరకూ ఎలా నడచుకోవాలో చెబుతున్నట్టు పట్టుబడిన ఇద్దరు చిన్నారులు వెల్లడించారు.

## పర్యావరణం మరింత బలోపేతం



పూడూరు: పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడం కోసం చేపట్టిన 'వన మహోత్సవం' (గతంలో హరిత హారం) పటిష్ఠ అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గతంలో నాటి పాడైన వాటి స్థానంలో మొక్కలు నాటేందుకు ఇటీవల 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చారు. అంతేకాదు ఈసారి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటడం చేస్తున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వటం, పూలు, పండ్ల జాతులు వృద్ధిచేసి అవసరమున్న వారికి అందజేస్తున్నారు.

ఆరు నెలల ముందునుంచే కార్యాచరణ

జిల్లా వ్యాప్తంగా ఈసారి 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామాల్లో వన మహోత్సవం చేపట్టేందుకు అధికారులు ఆరు నెలల ముందు నుంచే కార్యాచరణ చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు పెంచారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఈసారి గ్రామ పంచాయతీకి ఐదు వేల వరకు మొక్కలు పెంపకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 566 నర్సరీలు జిల్లాలోని పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 566 నర్సరీలు ఏర్పాటుకాగా, పూడూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు పెంచారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటాల్సిన చోట గుంతలు తీయించే పనులు జరుగుతున్నా యి. వెంటనే మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లో అలోవేర, దానిమ్మ, కరివేపాకు, రెయిన్ ట్రీ, నీలగిరి, నిమ్మ, ఉసిరి, టేకు, మద్ది, గులాబీ, మందారం, జామ, మామిడి, సీతాఫలం, చింత, కానుగ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కొందరు దూరపు ప్రాంతాలలో ప్రైవేటు నర్సరీల నుంచి ఖరీదైన మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఈ సందర్భంగా పూడూరు ఏపీఓ రాములుతో మాట్లాడుతూ.. ఇంకా విస్తారంగా నాటాల్సి ఉందన్నారు. పూడూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటివరకు 90 శాతం మేర మొక్కలు నాటామన్నారు. క్షేత్రసహాయకుల ఆధ్వర్యంలో కూలీలు గుంతలు తీస్తున్నారని, రహదారులతో పాటు ఎక్కడ ఖాళీ స్థలాలున్నా వారు మొక్కలు నాటేందుకు ప్రోత్సహిస్తామన్నారు.

## విద్యుత్తు నియంత్రికలు ఢాం

సిరిసిల్ల : మొన్నటి వరకు ఎండా కాలం వల్ల విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుత వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడం వల్ల సాగునీటి కోసం అన్నదాతలు వ్యవసాయ కరెంటు మోటార్లను నిరంతరాయంగా నడుపుతున్నారు. ఫలితంగా విద్యుత్తు నియంత్రికలపై అధికభారం పడుతుండటంతో తరచూ కాలిపోతున్నాయి. దీంతో వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాటి మరమ్మతులు, కొత్త వాటిని అమర్చడంలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్)పై ఆర్థికభారం పడుతోంది. కాలం చెల్లినవి ఓవర్‌లోడ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. జిల్లాలో సెస్ పరిధిలో వివిధ రకాల సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అందించడానికి మొత్తం 10,508 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు 449 పైగా టాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిని పూర్తిగా మరమ్మతు చేయడానికి



ఒక్కో దానికి సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. నియంత్రికలో కాలిపోయిన భాగాలను బట్టి మరమ్మతు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో కనెక్షన్లను బట్టి లోడ్‌ను అంచనా వేసి నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా, ఓవర్‌లోడ్ కాకుండా అదనపు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్రమ కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరిస్తున్నారు.
ఎల్లారెడ్డిపేట మండలంలో జూన్ నుంచి ఆగస్టు వరకు సుమారు 60 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. ప్రస్తుతం సాగునీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులు ఆటో స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ఒక్కసారిగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతుంది. అలాగే నాణ్యత లేని కరెంటు మోటార్ల వల్ల కూడా కాలిపోతున్నాయి.
కారణాలు ఇవీ...నాణ్యత లేని మోటార్లను వాడటం వల్ల ఎక్కువ ఆమ్స్ విద్యుత్తును తీసుకుంటున్నాయి. నియంత్రికల్లో ఎల్‌టీ బుష్‌లు కరిగిపోవడం, హెచ్‌టీ లింకులు విరిగిపోవడం, ఆయిల్ తగ్గిపోవడం, ఫ్యూజులు పోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతూ ఏకంగా కాలిపోతున్నాయి.
గాలితో కూడిన వర్షాలకు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి రాసుకోవడం, పిడుగుపాటు ప్రభావం కూడా వీటిపై పడుతోంది. చాలా చోట్ల ఏళ్ల కింద అమర్చినవి అధిక భారాన్ని తట్టుకోలేకపోతున్నాయి.
రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడంతోపాటు ఆటో స్టార్టర్లను వినియోగించుకోకుంటే విద్యుత్తు నియంత్రికల జీవితకాలం పెరుగుతుందని సెస్ అధికారులు చెబుతున్నారు.

మరమ్మతులు నిరంతర ప్రక్రియ

సెస్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వినియోగదారులు సెస్‌కు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలి. విద్యుత్తు మరమ్మతులు రోజూ కొనసాగుతూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వదులు తీగలను సరిచేశాం. వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు ఉంటే సెస్ సిబ్బందిని సంప్రదించాలి. - శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ



# విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమిపూజ

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు.. విశాఖలో అకాడమీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. విశాఖ పరిధిలోని అరిలోవా ప్రాంతంలో అకాడమీ కోసం నిర్మాణ పనులకు ఆమె తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. బ్యాడ్మింటన్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతను ఉన్నత స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పీవీ సింధు అన్నారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇక్కడ సుమారు మూడెకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు కేటాయించింది.

# డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనిత భేటీ



అమరావతి: ముఖ్యమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఫేక్ పోస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోం శాఖ తీసుకుంటున్న చర్యలను పవన్ కల్యాణ్‌కు అనిత వివరించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అనిత తెలిపారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం శ్రమించే ప్రజా ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని నేతలు చర్చించుకున్నారు.

తానూ ఫేక్ పోస్టు బాధితురాలినంటూ అంటూ అనిత పవన్ కల్యాణ్‌తో అన్నారు. తన కూతురు కన్నీరు చూసే తాను ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశానని పవన్ వెల్లడించారు.


# సోషల్ మీడియా సైకో బాధితుల్లో నేనూ ఉన్నా: షర్మిల



అమరావతి: కొందరు సైకోలు, సైకో పార్టీలతో కలిసి సోషల్ మీడియాను భ్రష్టు పట్టించారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. మానవ సంబంధాలు, రక్త సంబంధాలు మరిచి మృగాలుగా మారారని విమర్శించారు.

ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "తల్లి, చెల్లి అనే ఇంగితజ్ఞానం కూడా లేకుండా పోస్టులు పెట్టారు. ప్రశ్నించే మహిళలపై అసభ్యకర పోస్టులతో రాక్షస ఆనందం పొందారు. సోషల్ మీడియా సైకో బాధితుల్లో నేనూ ఉన్నా. అసభ్యకర పోస్టులతో పరువు, ప్రతిష్ఠ దెబ్బతీసే పోస్టులు పెట్టారు. పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాతో సహా నా తల్లి విజయమ్మ, సునీతలపై విచ్చలవిడిగా పోస్టులు పెట్టారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే పుట్టలేదని నన్ను అవమానించారు. నా ఇంటి పేరు కూడా మార్చి రాక్షస ఆనందం పొందారు. నాపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిపై కేసు పెట్టా. దారుణమైన పోస్టులు పెట్టేవారు ఏ పార్టీలో ఉన్నా అంతు చూడాలి" అని షర్మిల మండిపడ్డారు.

# ఉగ్రవాదాన్ని ఏరివేయడానికి గొప్ప వ్యూహంతో ముందుకెళ్తున్నాం: అమిత్ షా



దిల్లీ: ఉగ్రవాదాన్ని ఏరివేయడానికి మోదీ సర్కార్ ఎంతో కృషి చేస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. అందుకు గొప్ప వ్యూహంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. 'యాంటీ టెర్రర్ కాన్ఫరెన్స్-2024' ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తోంది. అంతర్గత భద్రత కోసం సరిహద్దుల వద్ద ఇప్పటివరకు 36 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారందరికీ నివాళులర్పిస్తున్నా. దేశం తరఫున వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఉగ్రవాద కార్యకలాపాల కట్టడి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' నినాదంతో ముందుకెళ్తోంది. ప్రస్తుతం ప్రపంచం అంతా ఈ విధానాన్నే అనుసరిస్తోంది" అని అమిత్ షా పేర్కొన్నారు. "ఉగ్రవాదంపై పోరాడేందుకు బలమైన వ్యవస్థను ఏర్పాటుచేశాం. అయితే.. ఉగ్రవాదులు ఎలా దాడి చేసినా దాన్ని మనం ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు యువ అధికారులకు అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరం. భవిష్యత్తుల్లో వారి శిక్షణలోను దీన్ని భాగం చేస్తాం. ఉగ్రవాదంపై పోరాడేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ మరో అడుగు ముందుకువేస్తోంది. జాతీయ ఉగ్రవాద నిరోధక విధానాన్ని, మరింత బలమైన వ్యూహాన్ని తీసుకువస్తాం" అని తెలిపారు.



# జగన్‌కు మాస్ వార్నింగ్

ఐదేళ్లు సీఎంగా జగన్ చేసిన పాపాలతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇవాళ రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన ఆయన తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం గ్రామంలో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్ దుర్మార్గ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. వైసీపీ పాపాలకు జనం బలవుతున్నారన్నారు. జగన్ చేసిన పాపాలకు బదులుగా ఓటర్లు ఎన్నికల్లో వాతలు పెట్టి ఇంటికి పంపించారన్నారు.

దుర్మార్గులకు అధికారం ఇవ్వడమే ప్రజలు చేసిన తప్పన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నిధులు ఇవ్వని పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. జగన్ అరాచక పాలనతో పోలవరం వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రహదారులను గోతుల మయం చేశారన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి విద్యుత్తు ఛార్జీలు పెరగవని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ఇటీవల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయన్నారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..** రాజధాని ప్రాంతం అభివృద్ధి కోసం 400 కేవీ విద్యుత్ సరఫరా లైన్లు శాశ్వత మళ్లింపు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేదుకు రూ.505 కోట్లతో నిర్మించిన జీఐఎస్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను చంద్రబాబు ప్రారంభించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5407 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. సీఆర్డీయే పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాళ్ళాయపాలెంలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆర్థిక అభివృద్ధి సాధించడంలో 24%ఇ%7 గంటలు విద్యుత్ సరఫరా కీలక పాత్ర పోషించనుంది. రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం క్రమక్రమంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలో తాళ్లాయపాలెంలో 400/220 కెవి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రాన్ని సర్కార్ నిర్మించింది. ఈ కేంద్రాన్ని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ తాళ్లాయపాలెంలో ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు రాజధాని ప్రాంతానికి 220/132/33కేవీ తాడికొండ కేంద్రం నుంచి కరెంట్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం నిర్మించిన 400/220 విద్యుత్ కేంద్రంతో పాటు నేలపాడులో 220/33 కేవీ విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మించాలని సర్కార్ నిర్ణయించింది. వీటి ద్వారా రాజధాని ప్రాంతంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది.



# 'మీరు సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకుంటాం'

అమరావతి: గత ఐదేళ్ల విధ్వంస పాలనలో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఏపీ హోంశాఖ మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం పరువు తీసే విధంగా పాలన సాగించారని మండిపడ్డారు. రాజకీయ ముసుగులో వైకాపా నేతలు అనేక దారుణాలు చేశారన్నారు. ఈ 5 నెలల కాలంలో ఏవేవో జరిగిపోయాయంటూ జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. శాంతి భద్రతలు, ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు ఏం చేశారనే దానిపై జగన్ మాట్లాడాలని అనిత డిమాండ్ చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి అనిత.. గత వైకాపా పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "జగన్ తన పాలనతో రాష్ట్రం పరువు ఎప్పుడో తీసేశారు. వైకాపా హయాంలో ఎన్ని నేరాలు జరిగాయో లెక్కలు తీయండి. రాష్ట్రంలో ఎన్ని నేరాలు జరిగినా జగన్ ఐదేళ్లపాటు మాట్లాడలేదు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినా ఆయన పట్టించుకోలేదు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వైకాపా పాలనలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా పెరిగాయి. ఐదు నెలల్లో ఏదో జరిగిపోయిందంటూ అభాండాలు వేస్తున్నారు. మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని అనేకమందిపై కేసులు పెట్టారు. అమరావతి మహిళా రైతుల గురించి నీచంగా మాట్లాడారు. దుర్గమ్మ గుడికి వెళ్లకుండా ఎలా అడ్డుకున్నారో చూశాం. డీజీపీ ఆఫీసు పక్కనున్న తెదేపా కార్యాలయంపై దాడి చేశారు. జగన్ హయాంలో పరదాలు కట్టుకొని సమావేశాలు పెట్టుకున్నారు. పెన్నులు, నల్లబట్టలు వేసుకున్నా సభలకు రానీయలేదు"

**కొన్ని పోస్టుల గురించి మాట్లాడాలంటేనే సిగ్గుగా ఉంది :** "క్రిమినల్‌కు కులం, మతం, ప్రాంతం, పార్టీ ముసుగు ఎందుకు? ఏం జరిగినా మా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. అత్యాచారాలు జరుగుతున్నాయని లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. చీకటి రోజులు అంటే జగన్ తెలుసుకోవాలి. వైకాపా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి.. విజయమ్మ, షర్మిల, నాపై దారుణమైన పోస్టులు పెట్టాడు. సొంత తల్లి, చెల్లిని వైకాపా కార్యకర్తలే తిడుతుంటే జగన్‌కు పౌరుషం రాలేదా? తల్లి, చెల్లి గురించి ఎవరు అసభ్యంగా మాట్లాడారో మీకు తెలియదా? ఆ మాటలతో మీ రక్తం మరగలేదేమో.. మా రక్తం మరుగుతోంది. వైకాపా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారు. గౌతు శిరీష, చింతకాయల విజయ్, రంగనాయకమ్మను ఇబ్బందులకు గురి చేశారు. ఏమైనా మాట్లాడితే భావ ప్రకటనా స్వేచ్ఛ అంటున్నారు. కొన్ని పోస్టుల గురించి మాట్లాడాలంటేనే సిగ్గుగా ఉంది. ఇలాంటివి సహించాలంటారా? పోస్టులు పెట్టిన వారిని వదిలేయమంటారా"

**సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకుంటాం :** రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయాలంటే.. చేయండి.. మేం ఎదుర్కొంటాం.. బాధ్యతగా సమాధానం ఇస్తాం. అంతే కానీ అసభ్యంగా పోస్టులు పెట్టే వారిని, క్రిమినల్స్‌ను వెనకేసుకు రావడమేంటి? మేమేదో వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నామంటూ మాట్లాడుతున్నారు. ఇలాంటి పిచ్చి పనులు చేసేవారికి బెయిల్ ఇప్పించేందుకు జగన్ వార్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంటే ఏమిటో జగన్‌కు తెలుసా? సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్న వైకాపా కార్యకర్తలను హెచ్చరిస్తున్నా. మీరు సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకుంటాం" అని మంత్రి హెచ్చరించారు.

# మహిళను అవమానిస్తారా? మీరు లాగేసినా ప్రజలు నాకు కుర్చీ ఇచ్చారు: తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డి



కడప: కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో రసాభాస జరిగింది. మేయర్ ఛాంబర్‌లో ఇద్దరు తెదేపా ఎమ్మెల్యేలకు కుర్చీలు తీసేశారు. దీంతో తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిల్చొని నిరసన తెలిపారు. మరోవైపు ఆమె మాట్లాడుతుండగా మేయర్ సురేశ్, కార్పొరేటర్లు అడ్డుకున్నారు.

ఎక్స్ అఫీషియో మెంబర్‌గా మాట్లాడే అవకాశం ఉందని మాధవి పట్టుబట్టారు. ఈ క్రమంలో గందరగోళం నెలకొంది. మాధవీరెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం తీరుపై మండిపడ్డారు. "మహిళను అవమానిస్తారా? మీరు లాగేసినా ప్రజలు నాకు కుర్చీ ఇచ్చారు. కుర్చీల కోసం పోరాడాల్సిన అవసరం నాకు లేదు. సమావేశమంతా నిల్చొని మాట్లాడే శక్తి నాకుంది. అహంకారం, అధికారం ఎక్కువైతే ఎలా ప్రవర్తిస్తారో చూస్తున్నాం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నగరపాలక సంస్థ వద్ద పోలీసులు మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేశారు.


# చంద్రబాబు కృషి వల్లే ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు: మంత్రి లోకేశ్



అమరావతి: ఉన్నత విద్య కోసం తాను కూడా విదేశాలకు వెళ్లి వచ్చానని మంత్రి లోకేశ్ తెలిపారు. మనకు, విదేశాల్లో ఉన్నత విద్యకు తేడాలు ఉన్నాయని చెప్పారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరై మాట్లాడారు. విదేశాల్లో పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీల్లో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. "ఐటీ రంగం అభివృద్ధి కోసం చంద్రబాబు చేసిన కృషి వల్లే అద్భుత ఫలితాలు వచ్చాయి. దీంతో మన విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు. విదేశాల్లో ఇప్పుడు మన తెలుగు వాళ్లు మంచి స్థానాల్లో ఉన్నారు. గెలవడం కోసం నిలబడాలన్న మాటను విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలి. అంతర్జాతీయ పరిణామాల గురించి అవగాహనతో ఉండాలి. రాబోయే 25 ఏళ్లలో ఇండియా మరింత అభివృద్ధి చెందనుంది. వికసిత్ భారత్, వికసిత్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నాం. ప్రపంచ ఆర్థికశక్తిగా భారత్ ఎదిగేందుకు అవకాశం ఉంది" అని లోకేశ్ తెలిపారు.

# రాజధానికి భూములు.. రంగంలోకి దిగిన నారాయణ.. సక్సెస్ అయ్యేనా

విజయవాడ, నవంబర్ 7: విజయవాడలో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆయన.. రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్తున్నారు. విజయవాడలోని రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లారు. ఇప్పటికే రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పూలింగ్ అంగీకార పత్రాలను స్వీకరించారు. అయితే.. ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లిన మంత్రి.. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి వివరాలను వెల్లడిస్తున్నారు. గతంలో పలు అనుమానాలు, భయాలతో పలువురు రైతులు రాజధాని అమరావతికి భూములు ఇవ్వలేదు. వారి వల్ల రాజధాని డిజైనింగ్, నిర్మాణాలకు కొంత మేర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో స్వయంగా మంత్రి నారాయణ రంగంలోకి దిగారు. భూములు ఇవ్వకుండా భయంతో, అనుమానాలతో ఉన్న రైతుల ఇళ్లకు మంత్రి నారాయణ వెళ్లి అన్నదాతలను కలుస్తున్నారు. ల్యాండ్ పూలింగ్, రాజధాని నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో ఉన్న రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లి కలిశారు. రాజధాని అమరావతి ప్రాముఖ్యత, రాజధాని నిర్మాణం ఆవశ్యకతపై వివరించి.. రాజధానికి ఇవ్వాల్సిన భూములు ఇవ్వాలని వినతి చేశారు. ఇక ఇప్పటికే రాజధాని గ్రామాల్లో ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లి పలువురిని స్వయంగా కలిసి... రాజధానికి భూములు ఇచ్చి రాజధాని నిర్మాణానికి సహకరించాలని నారాయణ చేస్తున్న ప్రయత్నాలు



ఫలిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత పదేళ్ల పాటు భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులు ఇప్పుడు కాస్త మెత్తబడుతున్నట్లు సమాచారం. మంత్రి నారాయణ స్వయంగా ఇంటికెళ్లి.. భూముల విషయంలో ఆయన అడిగిన తీరుకు కొంతమంది రైతులు మెత్తబడి భూములు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితేనే రాజధాని నిర్మాణం వేగవంతం అవుతుంది. మరి మంత్రి నారాయణ చేస్తున్న ప్రయత్నం ఏ మేరకు సక్సెస్ అవుతుందో చూడాలి మరి.



# 18 నుంచి బీసీ కమిషన్ బహిరంగ విచారణ

హైదరాబాద్: రాష్ట్రంలో వెనుకబడిన కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు బీసీ కమిషన్ ఈ నెల 18వ తేదీ నుంచి బహిరంగ విచారణలు తిరిగి ప్రారంభించనుంది. తొలుత అక్టోబరులో జారీ చేసిన షెడ్యూలు ప్రకారం అక్టోబరు 28 నుంచి నవంబరు 13 వరకు ఉమ్మడి జిల్లాలు, కమిషన్ కార్యాలయంలో అన్ని వర్గాలతో విచారణలు నిర్వహించాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ వేసింది. అయితే, అప్పటికే బీసీ కమిషన్ ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణలు పూర్తిచేయగా... మిగిలిన జిల్లాల్లో ఈ ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు విచారణలు నిర్వహించాలని నిర్ణయించింది. బహిరంగ విచారణ సమయంలో కమిషన్ దృష్టికి వచ్చిన వివిధ అంశాలను ప్రభుత్వానికి తెలపనుంది. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించి, తమ వివరాలు నమోదు చేయాలని కమిషన్ కోరింది. నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలు బీసీ కులాల వారిని సామాజికంగా బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ కమిషన్ పేర్కొంది. ఆ కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి లేఖ రాయనుంది. బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరనుంది.

**అధ్యయన వివరాలు తెలుసుకున్న ప్రత్యేక కమిషన్ :** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి గత, ప్రస్తుత కమిషన్లు చేసిన అధ్యయన వివరాలను కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక కమిషన్ తెలుసుకుంది. పొరుగు రాష్ట్రాల కమిషన్లు.. రిజర్వేషన్ల ను ఎలా ఖరారు చేశాయి? ప్రస్తుత పరిస్థితులు, ఇతర వివరాలు అడిగింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలోని ప్రత్యేక కమిషన్.. తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మిలను కలిసింది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారంపై ఆరా తీసింది. అంతకుముందు ప్రత్యేక కమిషన్ ఛైర్మన్‌గా బూసాని వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. సంక్షేమభవన్ నాలుగో అంతస్తులో కమిషన్ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా నివేదిక తయారు చేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ప్రత్యేక కమిషన్ కార్యదర్శిగా బి.సైదులు బాధ్యతలు తీసుకున్నారు.



# చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు చేరుకున్నారు. నేటి నుంచి రెండు రోజుల పాటు ఆ నగరంలో చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు బుధవారమే బెంగళూరు వెళ్లగా.. రంగనాథ్ గురువారం అక్కడికి చేరుకున్నారు. చెరువుల పనరుద్ధరణతో పాటు విపత్తు నిర్వహణపై వారు అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు తమ పర్యటనలో యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించనున్నారు. అక్కడి సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ సమావేశం కానున్నారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది.

# రూ.లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకు నాపై కేసు పెడతారా?: కేటీఆర్




హైదరాబాద్: " రాష్ట్రానికి రూ. లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినందుకు నాపై కేసు పెడతారా?" అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా.. కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటానని చెప్పారు. ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం.. అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై విచారణ వేగవంతమైన నేపథ్యంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. "జైలుకెళ్లేందుకైనా నేను సిద్ధమే. జైల్లో పెడితే యోగా చేసి.. పాదయాత్రకు సిద్ధపడతా. రాజ్‌భవన్‌లో కాంగ్రెస్, భాజపా ఒక్కటవుతున్నాయి. ఆ రెండు పార్టీలు ఒక్కటై భారాసను ఖతం చేసేందుకు యత్నిస్తున్నాయి. నన్ను విచారించేందుకు అనుమతివ్వడం గవర్నర్ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. నాపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడితే ఎదుర్కొంటా. విశ్వనగరాల సరసన హైదరాబాద్‌ను చేర్చాలనే ఉద్దేశంతోనే ఫార్ములా-ఈ కారు రేసింగ్‌ను ఏర్పాటు చేశాం. ఫార్ములా-1 రేసింగ్‌ను నిర్వహించేందుకు అనేక దేశాలు పోటీ పడతాయి. అయితే, దానిని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు నిర్వాహకులు అంగీకరించకపోవడంతో ఫార్ములా-ఈ రేసింగ్‌కు మొగ్గు చూపాం. ఫార్ములా-1 రేసింగ్ తొలిసారి 1946లో జరిగింది. ఈ రేస్ నిర్వహణకు అనేక దేశాలు పోటీపడతాయి. భారత్‌లో ఫార్ములా-1 రేసింగ్ నిర్వహించాలని 2003లోనే చంద్రబాబు ఆశించారు. కానీ, నిర్వాహకులు సుముఖత చూపించకపోవడంతో సాధ్యం కాలేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మళ్లీ నేను వాళ్లతో మాట్లాడాను. అయినా ప్రయోజనం లేకపోయింది. అందుకే ఎలక్ట్రిక్ వాహనాలతో నిర్వహించే ఫార్ములా-ఈ కారు రేసింగ్ నిర్వహించాం. 1984లో ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు దిల్లీలో జరిగాయి. వాటి కోసం రూ.70,608 కోట్లు ఖర్చు చేశారు. అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్రభుత్వాలు ఖర్చు చేయడం సర్వసాధారణం. కామన్వెల్త్ క్రీడల కోసం ఒరిజినల్ కాస్ట్ కంటే 100 రెట్లకుపైగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసింది. దాంతో పోల్చుకుంటే ప్రస్తుతం నిర్వహణ వ్యయం దాదాపు పది.. పదిహేను రెట్లు పెరుగుతుంది.

కానీ, ఓ మంచి ఉద్దేశంతో హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహిస్తే.. దానిపై ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తోంది. రేసు రద్దు చేసినందుకు రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖలపై కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేస్తే.. రేవంత్‌రెడ్డి బ్యాడ్ ఇమేజ్ తెస్తున్నారు. మేఘా కృష్ణారెడ్డి ఇంటిపైకి ఏసీబీని పంపే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? సుంకిశాల ఘటనలో అవినీతి కేసు పెట్టాల్సి వస్తే కృష్ణారెడ్డిపై పెట్టాలి. రూ.80 కోట్లు నష్టం జరిగిందని అధికారులు నివేదిక ఇచ్చారు. అంతమేర ప్రభుత్వానికి నష్టం చేసిన మేఘాను బ్లాక్ లిస్టులో పెట్టే దమ్ముందా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# నేడు సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర



హైదరాబాద్: ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి వెళ్లనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు యాదాద్రి చేరుకొని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్షించనున్నారు. సమీక్ష అనంతరం సంగెం నుంచి సీఎం మూసీ నది పునరుజ్జీవ సంకల్ప యాత్ర చేపట్టనున్నారు. సంగెం నుంచి భీమలింగం వరకు దాదాపు 2.5కి.మీ పాదయాత్ర చేయనున్నారు. పాదయాత్రలో భాగంగా మూసీ పునరుజ్జీవ సంకల్ప రథంపై నుంచి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

# సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చింది భారాస కాదా?: శ్రీధర్‌బాబు

హైదరాబాద్: కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని భారాస నాయకులు సర్పంచులతో ధర్నాలు, ఆందోళనలు చేయించడంపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు సర్పంచుల ఆత్మహత్యలకు భారాస నాయకులు కారణం కాదా? అని నిలదీశారు. కాంట్రాక్టు పనుల బిల్లులు చెల్లించకుండా సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చింది భారాస కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు అదే భారాస నాయకులు సర్పంచులతో ధర్నాలు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు.

సర్పంచులకు చెల్లించాల్సిన దాదాపు రూ.1300 కోట్లు దారి మళ్లించి ఇతర అవసరాలకు వాడుకుంది గత ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు సర్పంచులపై దొంగ సానుభూతి కనబరుస్తున్న విషయం ప్రజలకు కూడా తెలుసన్నారు. భారాస నాయకుల తీరు చూస్తుంటే దొంగే దొంగ అని అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. "అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆందోళన చేసి.. సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు ఇచ్చారు. అప్పట్లో రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొడుతున్నారని శోకాలు



పెట్టిన చరిత్ర భారాస నేతలది. ప్రజలకు సేవ చేసేందుకు ఎన్నికల్లో నిల్చుని సర్పంచులుగా గెలిస్తే వారికి గులాబీ పార్టీ జీవితంలో మర్చిపోలేని బహుమతి ఇచ్చింది. సర్పంచులకు రావాల్సిన బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తాం. మాజీ సర్పంచులు ఎవరూ భారాస నాయకుల రెచ్చగొట్టే మాటలు నమ్మొద్దు. ధర్నాలు, ఆందోళనలు చేయొద్దు" అని మంత్రి కోరారు.




# ఫెడ్ వడ్డీ రేట్లపై మదుపర్ల దృష్టి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రధాన స్టాక్‌లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో దూసుకెళ్లిన సూచీలు నేడు ఒత్తిడికి గురవుతున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. దీంతోపాటు వడ్డీ రేట్లపై ఫెడ్ తన నిర్ణయాలను ప్రకటించనుండటంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సెన్సెక్స్ ఏకంగా 850 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,300 దిగువన ట్రేడవుతోంది. ఉదయం 10:45 గంటల సమయంలో సెన్సెక్స్ 854 పాయింట్ల నష్టంతో 79,529 వద్ద ట్రేడవుతుంటే.. నిఫ్టీ 279 పాయింట్లు కుంగి 24,210 వద్ద కొనసాగుతోంది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎంఅండ్ఎం, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ.. ఈ రెండు షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి.



# 11 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత

హైదరాబాద్: సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. 11 నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వివరించారు. కార్యశాలలో సునీల్ బన్సల్, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే షెడ్యూల్ ఇదే..

రేపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా రేపు ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు %ుణూూ% అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

# రేవంత్‌కు ఫ్యాన్స్ బిగ్ సర్‌ప్రైజ్.. జీవితంలో గుర్తుండిపోయేలా బర్త్‌డే కానుక

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నేత. పదేళ్ల పాటు అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌ను తిరిగి గద్దెనెక్కేలా చేశారు రేవంత్. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ దిగువ స్థాయి శ్రేణులను కూడా కలుపుకుంటూ పోతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేశారు. మొత్తానికి అనుకున్నది సాధించిన రేవంత్.. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపేందుకు కృషి చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు రేవంత్. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే తెలంగాణ సీఎం పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బిగ్ సర్‌ప్రైజ్ ఇవ్వాలని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు. దీంతో జీవితంలో ఆయనకు గుర్తుండుపోయేలా ఓ కానుకను ఇచ్చారు. సైకత శిల్పాలకు ఫేమస్ అయిన ఒడిశాలోని పూరి బీచ్‌లో రేవంత్ సైకత శిల్పాన్ని వేయించి.. ఆయనకు బర్త్‌డే కానుకను అందజేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డికి వచ్చిన ఓ స్పెషల్ కానుక మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్.. రేవంత్ రెడ్డి పట్ల వెరైటీగా తన అభిమానాన్ని చాటుకున్నారు. సీఎంకు ఆయన ఇచ్చిన అపురూపమైన బహుమతి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ సాయి కుమార్.. రేవంత్‌కు ఇచ్చిన బహుమతి ఏంటో ఇప్పుడు చూద్దాం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఒరిస్సాలోని సముద్రతీరం పూరీ బీచ్‌లో సైకత శిల్పాన్ని ఆవిష్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి ఈడీ నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 07: పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది. అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com